TELANGANA SHASANA SABHA
TELTEL/2016/68867

# తెలంగాణ శాసనసభ

తెలుగు దినపత్రిక

Published from Hyderabad,Rangareddy,Nalgonda,Mahabubnagar, Khammam,

తెలంగాణ | సంపుటి : 02 | సంచిక : 119 | ఎడిటర్ : పోలగోని రాజేష్ | శనివారం 05 అక్టోబర్ - 2024 | పేజీలు : 8 | వెల : 04/-

## తిరుమల వేంకటేశ్వరుడికి పట్టువస్త్రాలు సమర్పించిన సీఎం చంద్రబాబు



- తిరుమలలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు
- సతీసమేతంగా విచ్చేసిన సీఎం చంద్రబాబు
- ఘనస్వాగతం పలికిన మంత్రి ఆనం, టీటీడీ అధికారులు

**అమరావతి / శాసనసభ :** నేటి నుంచి శ్రీ వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు జరగనున్న నేపథ్యంలో, ఏపీ సీఎం చంద్రబాబు తిరుమల చేరుకున్నారు. తిరుమల కొండపై పద్మావతి అతిథి గృహం వద్ద చంద్రబాబుకు మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, టీటీడీ అధికారులు స్వాగతం పలికారు. సీఎం చంద్రబాబు సతీసమేతంగా వెంకన్నస్వామికి ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం, టీటీడీ క్యాలెండర్లు, డైరీలు ఆవిష్కరించారు. కాగా, చంద్రబాబు శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా పెద్ద శేష వాహన సేవలోనూ పాల్గొననున్నారు.

# 2036 ఒలింపిక్స్ లక్ష్యంగా కొత్త క్రీడా పాలసీ

## సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు



- అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణకు గుర్తింపు
- ప్రత్యేకంగా బోర్డు ఏర్పాటు చేసి చైర్మన్‌ను నియమించాలి.
- యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీ గా తీర్చిదిద్దాలి

**శాసనసభ / హైదరాబాద్ :** వచ్చే ఒలింపిక్స్ లక్ష్యంగా క్రీడా పాలసీ ఉండాలని అధికారులకు స్పష్టం చేశారు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి. అద్భుతమైన క్రీడాకారులను తీర్చిదిద్దటంతో పాటు అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణకు గుర్తింపు తెచ్చేలా కొత్త క్రీడా విధానం తయారు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. 2036 ఒలింపిక్స్‌ను దృష్టిలో పెట్టుకొని కొత్త పాలసీలో లక్ష్యాలను నిర్దేశించుకోవాలని చెప్పారు. కొత్త స్పోర్ట్ పాలసీ ముసాయిదాపై శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు కె.కేశవరావు, ఏపీ జితేందర్ రెడ్డి, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనా రెడ్డి, ఉన్నతాధికారులతో సమావేశమై సమీక్షించారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు వివిధ దేశాలు, ఇతర రాష్ట్రాలు అనుసరిస్తున్న విధానాలను ప్రధానంగా చర్చించి పలు సూచనలు చేశారు.

మిగతా »»2లో

## ధరణి పోర్టల్ రద్దు

### మంత్రి పొంగులేటి కీలక ప్రకటన




**శాసనసభ / హైదరాబాద్ :** ధరణి పోర్టల్, లేఅవుట్ల క్రమబద్ధీకరణ పథకం పై రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. ధరణి పోర్టల్‌ను రద్దు చేసి త్వరలో ఆర్ఓఆర్ చట్టం తీసుకువస్తామన్నా రు. అక్టోబర్ నెలకాఖరు లోగా అమల్లోకి తెస్తామని చెప్పారు. ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా ఉండే విధంగా రూపొందించా మని, ప్రజల అభిప్రాయాలను కూడా పరిగణలోకి తీసుకుంటామని మంత్రి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. గత ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్స్‌ను గాలికి వదిలేసిందని విమర్శించారు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి.

## పెట్టుబడులకు భారత్ స్వీట్ స్పాట్‌గా మారింది



**ఢిల్లీ / శాసనసభ :** పెట్టుబడులకు భారత్ స్వీట్ స్పాట్‌గా మారిందని ప్రధాని మోడీ అన్నారు. ఢిల్లీలో జరిగిన కౌటిల్య ఆర్థిక సదస్సులో మోడీ ప్రసంగించారు. భారత్‌లో పెట్టుబడులకు ఇదే సరైన సమయమని పెట్టుబడిదారులు భావిస్తున్నారని చెప్పారు. ఈ అనిశ్చితి వేళ పెట్టుబడులకు భారత్ స్వీట్ స్పాట్‌గా మారిందన్నారు. భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధి పథాన్ని కొనసాగించే దిశగా పరివర్తన మార్పులు కొనసాగుతున్నాయని వెల్లడించారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా అవతరించాలంటే వ్యవస్థీకృత సంస్కరణలు అవసరం అని మోడీ అభిప్రాయపడ్డారు. మూడోసారి అధికారం చేపట్టిన తర్వాత ఉద్యోగాలు, నైపుణ్యం, సుస్థిరాభివృద్ధి, వేగవంతమైన విస్తరణ వంటి అంశాలపై దృష్టి సారించినట్లు ప్రధాని మోడీ చెప్పారు.

మిగతా »»2లో

## మీ వేషమేంటి పవన్ ? ఇతర మతాలు అక్కర్లేదా ?

**డిప్యూటీ సీఎంగా ఒక మతానికి చెందిన బట్టలు వేసుకుని డ్యూటీ చేస్తుంటే మిగతా మతాలకు అభద్రతా భావం కలగదా**

- మీరా రాహుల్ గాంధీపై మాట్లాడేది
- ఆరెస్సెస్ సిద్ధాంతాన్ని బీజేపీ అనుసరిస్తుందని, మీరు కూడా అనుసరిస్తున్నారా
- అధికారం వచ్చాక పవన్ వేషం, భాష మారిపోయింద...




**అమరావతి / శాసనసభ :** ఏపీలో తిరుమల లడ్డూ వివాదం నేపథ్యంలో నిన్న తిరుపతిలో వారాహి సభ పెట్టి కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చేసిన విమర్శల్ని పీసీసీ ఛీఫ్ వైఎస్ షర్మిల తప్పుబట్టారు. అధికారం వచ్చాక పవన్ వేషం, భాష మారిపోయిందన్నారు. ఉన్నత హోదాలో డిప్యూటీ సీఎంగా ఉన్న పవన్ అన్ని వర్గాలకు న్యాయం చేయాల్సిన అవసరం ఉందని, అన్ని మతాల్ని సమానంగా చూడాల్సిన అవసరం ఉందని గుర్తుచేశారు.

# అవసరమైతే రాహుల్ గాంధీ ఇంటి ముందు ధర్నా చేసి.. రుణమాఫీ చేయిస్తా




**శాసనసభ / హైదరాబాద్ :** దసరా పండుగలోపు రైతులందరికీ రైతుబంధు ఇవ్వాలని బీఆర్ఎస్ పక్షాన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. అవసరమైతే దసరా పండుగ తర్వాత ఢిల్లీకి పోయి రాహుల్ గాంధీ ఇంటి ముందు కూడా ధర్నా చేస్తాం. వరంగల్ డిక్లరేషన్‌లో మాటిచ్చిన ప్రకారం.. రుణమాఫీ చేస్తావా.. చెయ్యవా.. అని రాహుల్ గాంధీ ఇంటి ముందు ధర్నా చేసి మీకు రుణమాఫీ చేయిస్తాను. విడిచిపెట్టే ప్రసక్తే లేదు.. మీరు ధైర్యంగా ఉండండి అని రైతులకు హరీశ్‌రావు భరోసా ఇచ్చారు. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు రైతు ధర్నాలో హరీశ్‌రావు పాల్గొని ప్రసంగించారు.

## జర్నలిస్టులుపై క్రిమినల్ కేసులు పెట్టొద్దు

### ప్రభుత్వంపై జర్నలిస్టులు విమర్శలు చేస్తే క్రిమినల్ కేసులు పెట్టొద్దు



**ఢిల్లీ / శాసనసభ :** ప్రభుత్వంపై జర్నలిస్టులు చేసే విమర్శలపై సర్వోన్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ వార్తలు రాస్తే.. జర్నలిస్టులపై క్రిమినల్ కేసులు పెట్టటం సరికాదని సుప్రీం కోర్టు వ్యాఖ్యానించింది. తనపై నమోదైన కేసును కొట్టివేయాలని కోరుతూ ఉత్తరప్రదేశ్‌కు చెందిన జర్నలిస్ట్ అభిషేక్ ఉపాధ్యాయ్ దాఖలు చేసిన పిటిషన్‌పై ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తులు హృషికేష్ రాయ్, ఎస్‌వీఎన్ భట్టిలతో కూడిన ధర్మాసనం విచారించారు. ప్రజాస్వామ్య దేశాల్లో అభిప్రాయాలు వ్యక్తపరిచే స్వేచ్ఛను గౌరవిస్తారని.. రాజ్యాంగంలోని ఆర్టికల్ 19 (1) (ఎ) ప్రకారం జర్నలిస్టుల హక్కులు రక్షించబడతాయని సుప్రీంకోర్టు పేర్కొంది.

మిగతా »»2లో

## రాజకీయాల్లో ఉన్నప్పుడు నోరు జాగ్రత్తగా పెట్టుకొని మాట్లాడాలి



**శాసనసభ / హైదరాబాద్ :** చార్మినార్ ఆలయం వద్ద బీజేపీ మహిళ మోర్చ ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో ఎంపీ డీకే అరుణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలపై రియాక్ట్ అయ్యారు. కొండా సురేఖతో నాకు మంచి అనుబంధం ఉంది.. గతంలో ఇద్దరం కలిసి మంత్రులుగా పని చేశాం.. కానీ ఓ సినీ కుటుంబంపై ఆమె చేసిన ఆరోపణలు అభ్యంతకరంగా ఉన్నాయని చెప్పుకొచ్చారు. సినిమా ఇండ్రస్టీలో ఆ కుటుంబానికి ప్రత్యేక పేరు ఉంది..

మిగతా »»2లో

## విజిలెన్స్ విచారణ అనగానే సుబ్బారెడ్డి ఎందుకు భయపడ్డారు?




- తిరుమల లడ్డూ వ్యవహారంలో సుప్రీంకోర్టు తీర్పు
- స్వతంత్ర సిట్ ఏర్పాటు చేయాలని ఆదేశాలు
- సుప్రీంకోర్టు నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామన్న ఏపీ హోంమంత్రి అనిత

శాసనసభ
తెలుగు దినపత్రిక
శనివారం 05 అక్టోబర్ - 2024

# హర్యానా అసెంబ్లీ ఎన్నికలకు సర్వం సిద్ధం: 90 స్థానాలకు నేడే పోలింగ్



శాసనసభ /హైదరాబాద్ : హర్యానా అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. శనివారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ ఓటింగ్ జరగనుంది. ఇందుకోసం కేంద్ర ఎన్నికల సంఘం సర్వం సిద్ధం చేసింది.హర్యానాలో మొత్తం 90 అసెంబ్లీ స్థానాలు ఉండగా 1031మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. వారిలో 101 మంది మహిళలు ఉన్నారు.రెండు కోట్లకు పైగా ఓటర్లు ఉండగా, వారి కోసం 20629 పోలింగ్ కేంద్రాలను ఎన్నికల సంఘం ఏర్పాటు చేసింది. పోలింగ్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా భారీగా పోలీసు బలగాలను మోహరించారు. ఒకే విడతలో పోలింగ్ జరగనుండగా.. అక్టోబర్ 8న ఓట్ల లెక్కింపు జరగనుంది.కాగా, హర్యానా ముఖ్యమంత్రి నయాబ్ సింగ్ సైనీ.. లాడ్వా నుంచి పోటీచేస్తుండగా.. ప్రతిపక్ష నేత భూపిందర్‌సింగ్ హుడా-గర్హి సంప్లాకిలోయి స్థానం నుంచి బరిలో ఉన్నారు. ఎల్లెనాబాద్ నుంచి ఐఎన్‌ఎల్‌డీ అధినేత అభయ్‌సింగ్ చౌతాలా, ఉచనా కలాన్‌లో జేజేపీ చీఫ్ దుష్యంత్ చౌతాలా, జులానా నుంచి మాజీ రెజ్లర్, కాంగ్రెస్ అభ్యర్థి వినేశ్ ఫొగట్ పోటీ చేస్తున్నారు.2019 హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో 68 శాతం ఓటింగ్ నమోదైంది. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ 40 స్థానాలు, కాంగ్రెస్ 31 సీట్లు గెలుపొందాయి. అయితే జేజేపీ మద్దతుతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది బీజేపీ. అయితే, దాదాపు స్వతంత్రులందరూ బీజేపీ సర్కారుకు మద్దతు తెలిపారు. దీంతో వరుసగా బీజేపీ అధికారంలోకి వచ్చింది. మరోసారి అధికారం చేపట్టేందుకు బీజేపీ.. ఈసారైనా అధికారం దక్కించుకోవాలని కాంగ్రెస్ విస్తత ప్రచారం చేశాయి. అయితే, అక్టోబర్ 8నే ఓటర్ల తీర్పుతో అసలై ఫలితాలు వెలువడనున్నాయి.

( మొదటి పేజీ తరువాయి )

## 2036 ఒలింపిక్స్ లక్ష్యంగా కొత్త క్రీడా పాలసీ: సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు

రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా నెలకొల్పనున్న స్పోర్ట్స్ యూనివర్సిటీని యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీ గా తీర్చిదిద్దాలి. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ తరహాలోనే స్పోర్ట్స్ యూనివర్సిటీని పీపీపీ తరహాలో నిర్వహించాలని సీఎం రేవంత్ సూచించారు.ప్రత్యేకంగా బోర్డు ఏర్పాటు చేసి ఛైర్మన్‌ను నియమించాలి. యూనివర్సిటీకి స్వయం ప్రతిపత్తి ఉండాలి. ఈ యూనివర్సిటీలో క్రికెట్, హాకీ, ఫుట్‌బాల్, బాస్కెట్ బాల్, స్విమ్మింగ్, టెన్నిస్, బ్యాడ్మింటన్, షూటింగ్, బాక్సింగ్, రెజ్లింగ్, టేబుల్ టెన్నిస్, అథ్లెటిక్స్, జిమ్నాస్టిక్స్, అక్వాటిక్స్ లాంటి 14 క్రీడలను స్పోర్ట్స్ హబ్‌లో చేర్చాలని సీఎం రేవంత్ స్పష్టం చేశారు.దాదాపు 70 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న గచ్చిబౌలి స్పోర్ట్స్ స్టేడియం ప్రాంగణంలో స్పోర్ట్స్ యూనివర్సిటీని ప్రారంభించాలి. హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియం, హకీంపేట స్పోర్ట్స్ స్కూల్, కోట్ల విజయ భాస్కరరెడ్డి ఇండోర్ స్టేడియం, సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం, ఓయూలోని వెలోడ్రోమ్ ప్రముఖ క్రీడా మైదానాలు, స్టేడియంలు అన్నింటినీ ఒకే గొడుకు కిందకు తెచ్చి స్పోర్ట్ హబ్‌గా మార్చాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు.తెలంగాణ భౌగోళిక పరిస్థితులతో పాటు ఇక్కడి యువతకు ఆసక్తి ఉన్న క్రీడలకు ప్రాధాన్యమివ్వాలి. శిక్షణకు దేశ విదేశాల్లో ఉన్న కోచ్‌లను రప్పించాలి. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన క్రీడాకారులకు ఇచ్చే ప్రోత్సాహకాలకు స్పష్టమైన విధానాన్ని రూపొందించాలి అని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.

## ధరణి పోర్టల్ రద్దు: మంత్రి పొంగులేటి కీలక ప్రకటన

పూర్తయిన ఇళ్లను దసరా లోపు పేద ప్రజలకు అందజేస్తామని మంత్రి తెలిపారు. వెంటనే మరమ్మతులు మౌలిక వసతులు కల్పిస్తామని చెప్పారు. ప్రతి నియోజకవర్గానికి 3500 నుంచి 4వేల ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. ప్రతిపక్షాల సలహాలు, సూచనలు తీసుకుంటామన్నారు.అక్టోబర్ 7తో ప్రజా ప్రభుత్వం ఏర్పడి 10 నెలలు అవుతుందని.. అయితే, ఈ పది నెలల్లో ప్రజలు కోరుకున్న వాటిని సాధించలేకపోయామన్నారు. రాబోయే రోజుల్లో తెల్ల రేషన్ కార్డు సహా అన్ని పథకాలకు స్మార్ట్ కార్డుతో అనుసంధానం చేస్తామని చెప్పారు. ఈ దసరా లోపు స్మార్ట్ కార్డులు ఇస్తామన్నారు. అర్హతలను బట్టి స్మార్ట్ కార్డు ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. రుణమాఫీ రైతులందరికీ త్వరలోనే డబ్బులు జమ చేస్తామన్నారు.మరోవైపు, లేఅవుట్ల క్రమబద్ధీకరణ పథకం అనుకున్నంత వేగంగ పుంజుకోవడం లేదన్నారు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి. అందుకే, పురపాలక, రెవెన్యూ శాఖలే కాకుండా అవసరమైతే ఇతర శాఖలకు చెందిన సిబ్బందిని కూడా నియమించుకుని దరఖాస్తుల పరిశీలన వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. దీంతో కొన్ని జిల్లాల్లో నీటిపారుదల శాఖ అధికారులను కూడా దరఖాస్తు పరిశీలన బృందాల్లో నియమించారు. గత నెలాఖరు వరకు సుమారు 4.50 లక్షల దరఖాస్తుల పరిశీలన మాత్రమే పూర్తియిందని, వాటిలో ఆమోదించినవి 70 వేలలోపే ఉన్నట్లు సమాచారం. పలు జిల్లాల్లో ఎల్‌ఆర్‌ఎస్ నత్తనడకన సాగుతుండటంతో ఆయా జిల్లాల కలెక్టర్లపై మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.

## జర్నలిస్టులుపై క్రిమినల్ కేసులు పెట్టొద్దు

ప్రభుత్వంపై జర్నలిస్టులు విమర్శలు చేస్తే క్రిమినల్ కేసులు పెట్టొద్దు జర్నలిస్టులు రాసే కథనాలను ప్రభుత్వంపై విమర్శలుగా భావించి.. సదరు జర్నలిస్టులపై క్రిమినల్ కేసులు పెట్టకూడదని న్యాయస్థానం సూచించింది. అలా చేస్తే అది భావప్రకటన స్వేచ్ఛకు విఘాతం కలిగించినట్లే అవుతుందని ధర్మాసనం అభిప్రాయపడింది.కుల వివరాలకు సంబంధించి ఓ వార్తా కథనాన్ని ప్రచురించినందుకు ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం జర్నలిస్ట్ అభిషేక్ ఉపాధ్యాయ్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. ఈ ఎఫ్ఐఆర్‌ను సవాల్ చేస్తూ.. ఆయన సుప్రీం కోర్టును ఆశ్రయించారు. దీంతో జర్నలిస్ట్ అభిషేక్ ఉపాధ్యాయ్‌ను అరెస్టు చేయకుండా మధ్యంతర రక్షణ మంజూరు చేసింది. ఈ సందర్భంగా ప్రభుత్వంపై విమర్శనాత్మక కథనాలు రాసినంత మాత్రన జర్నలిస్టులపై క్రిమినల్ కేసులు పెట్టడం సరికాదని భారత సర్వోన్నత న్యాయస్థానం అభిప్రాయపడింది.

## ఏదైనా పథకాన్ని ఆపి అయినా ఈ హామీలు నెరవేరుస్తాం

ఆర్థికంగా కష్టమైనా... ఏదైనా ఒక పథకాన్ని ఆపి అయినా సరే రుణమాఫీ, రైతుభరోసా, రైతుబీమాను అమలు చేస్తామని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. రుణమాఫీ కాలేదంటూ కేటీఆర్ విమర్శలు చేయడంపై మంత్రి స్పందిస్తూ... గతంలో రుణమాఫీ గురించి పట్టించుకోని పార్టీలు ఇప్పుడు మాట్లాడుతున్నాయని విమర్శించారు. రైతులు ఆదరిస్తేనే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. ఏదైనా పథకాన్ని ఆపి అయినా సరే రైతులకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తామన్నారు. అన్ని సబ్సిడీ పథకాలను పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు.రైతులకు కచ్చితంగా రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేసి తీరుతామన్నారు. ఏ ఒక్క రైతు అధైర్యపడవద్దన్నారు. దేశంలో ఎక్కువ పంటలను సాగు చేసే ఏకైక రాష్ట్రం తెలంగాణయే అన్నారు. మన రాష్ట్రంలో ఒక కోటి 45 లక్షల టన్నుల వరి ధాన్యం పండిస్తున్నట్లు చెప్పారు. ఏ ఒక్క రైతు ఇబ్బంది పడకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కష్టపడుతున్నారన్నారు. సన్నాలకు రూ.500 బోనస్ ఇస్తున్నట్లు చెప్పారు.

# బీఆర్ఎస్ ధర్నాలో నవ్వులు పూయించిన తొండ!



శాసనసభ /హైదరాబాద్ : రైతులకు రుణాలు ఇవ్వడం లేదని, రైతుల రుణమాఫీ కూడా చాలా మంది రైతులకు ఇంకా జరగలేదని బిఆర్ఎస్ పార్టీ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని టార్గెట్ చేసి విమర్శలు గుప్పిస్తుంది.ఈ క్రమంలోనే తాజాగా బీఆర్ఎస్ రైతు రుణం ధర్నా నిర్వహించారు. పాలకుర్తి నియోజకవర్గ పరిధిలోని తొర్రూరులో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు నేతృత్వంలో రైతు రుణం ధర్నా నిర్వహించారు.రైతు రుణం ధర్నాలో విచిత్ర సంఘటన ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు తో పాటు మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, బిఆర్ఎస్ ఎమ్మెల్సీలు పలువురు ముఖ్య నేతలు పాల్గొన్నారు. ఈ ధర్నా కార్యక్రమంలో ఒక విచిత్ర సంఘటన చోటు చేసుకుంది. స్టేషన్ ఘనపూర్ మాజీ ఎమ్మెల్యే మాజీ ఉప ముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య ప్రసంగిస్తున్న సమయంలో వేదిక మీదికి ఒక తొండ వచ్చింది.రాజయ్య ధోతీలో తొండ తొండను చూసి అక్కడే కూర్చున్న మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్ రావు సత్యవతి పక్కకు జరిగారు. ఇక తాటికొండ రాజయ్య తొండకు భయపడతారా అంటూ వారిని చూసి నవ్వారు. ఆపై ఆయన మాట్లాడుతున్న క్రమంలో తొండ నిలుచుని మాట్లాడుతున్న రాజయ్య దోతి పైకెక్కి షర్టు లోపలికి చొరబడింది. లోపల తొండ అలికిడి అర్థమైన రాజయ్య ఓ చేత్తో మైక్ పట్టుకుని మరో చేత్తో తొండను షర్టుతో గట్టిగా పట్టుకున్నారు.తొండను పట్టుకుని బయట పడేసిన బీఆర్ఎస్ శ్రేణులు ఇక పక్కనే ఉన్న బిఆర్ఎస్ రాజయ్య చొక్కా విప్పి తొండను పట్టుకొని బయటపడేశారు. ఇక రాజయ్య మాట్లాడుతున్న సమయంలో తొండ చేసిన పనికి ఇది కూడా ప్రభుత్వ కుట్రే అంటూ తాటికొండ రాజయ్య కాసేపు ఆ సభలోని వారితో చమత్కరించారు. దీంతో కాసేపు అక్కడ నవ్వుల పువ్వులు పూశాయి.తొండలపై రాజయ్య వ్యాఖ్యలు.. ఆపై రాజయ్య దోతీపైకి తొండ తాడికొండ రాజయ్య తొండలు మనల్ని ఏం చేస్తాయి అంటూ ప్రసంగిస్తున్న సమయంలోనే తొండ తాటికొండ రాజు ఏ మాటలను అర్థం చేసుకొని ఆయన ధోతీలోకి దూరి హంగామా చేసింది. తనకి ఈ ఆసక్తికర సంఘటన ఈరోజు బిఆర్ఎస్ పార్టీ రైతు రుణం ధర్నాలు చోటు చేసుకోవడంతో ఇప్పుడు అందరూ బీఆర్ఎస్ ధర్నాలో తొండ కథ నే చెప్పుకుంటున్నారు

## సీట్ల పంపకాలపై త్వరగా తేల్చండి.. నాన్చొద్దు: శరద్ పవార్



శాసనసభ / న్యూఢిల్లీ త్వరలో రగనున్న మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలపై అధికార, విపక్షకూటమి దృష్టి పెట్టాయి. ఇప్పటికే సీట్ల పంపకాలపై పలు దపాలు చర్చలు జరిపినా కొలిక్కి రాలేదు.ఈ నేపథ్యంలో ఎన్సీపీ అధినేత శరద్ పవార్ కీలక వ్యాఖ్యలు చేశారు. మహా వికాస్ అఘాడి కూటమి (ఎంవిఎ)లో సీట్ల సర్దుబాటును వీలైనంత తొందరగా పరిష్కరించాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. కూటమిలో ప్రస్తుత సీట్ల కేటాయింపు చర్చలలో తన ప్రమేయం లేదని స్పష్టం చేశారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సీట్ల పంపకాల చర్చల్లో తాను పాల్గొనడం లేదని తెలిపారు. కాబట్టి ఈ విషయాలపై తాను మాట్లాడటం సరికాదు' అని పేర్కొన్నారు.ఈనెల 7, 8, 9 తేదీల్లో సీట్ల పంపకాలపై జరగనున్న సమావేశాల నేపథ్యంలో పవార్ తన పార్టీ తరపున విజ్ఞప్తి చేశారు. మహారాష్ట్ర ప్రజలు మార్పు కోరుకుంటున్నారని ఈసారి తమ కూటమి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ కూటమి కుయుక్తులు జనం తెలుసుకున్నారని పేర్కొన్నారు. వీలైనంత త్వరగా సీట్ల పంపాలను కొలిక్కి తీసుకురావాలని తమ కూటమి నేతలను ఆయన కోరారు. ప్రజల మనస్సులోని భావాలకు అనుగుణంగా ముందుకు వెళ్లాలని ఆయన అన్నారు. ప్రస్తుత రాజకీయ వాతావరణాన్ని ఉపయోగించుకునేవిధంగా వ్యూహాత్మకంగా అడుగుల వేస్తున్నట్లు తెలిపారు.సీట్ల సర్దుబాటులో ఎన్‌సిపి నుండి జయంత్ పాటిల్, కాంగ్రెస్ నుండి నానా పటోలే , శివసేన-యుబిటి నుండి సంజయ్ రౌత్ వంటి నాయకులతో పాటు పలువురు కీలక నేతలు ఈ సమావేశంలో పాల్గొంటారని శరద్ పవార్ తెలిపారు. ఈ కీలక సమావేశాలలో సీట్ల పంపకాలపై ఓ కొలిక్కి వచ్చే అవకాశం ఉందని చెప్పారు. ఇప్పటికే పలు సమావేశాలు జరిగాయని, కొన్ని ఒప్పందాలు కుదిరాయని, మరికొన్ని చర్చలు పెండింగ్‌లో ఉన్నాయని వెల్లడించారు. కూటమి లక్ష్యాలకు అనుగుణంగా ఏకాభిప్రాయంతో సీటు పంపకాలు జరుగుతాయని , సమిష్టి కృషితో అధికారంలో వస్తామని ధీమా వ్యక్తం చేశారు.లోక్‌సభ ఎన్నికల సమయంలో తలెత్తిన అంతర్గత విభేదాలు, ఆందోళనలు పునరావృత్తం కాకుండా చూసుకుంటామని శరద్ పవార్ తెలిపారు. సాంగ్లీలో చిన్న సంఘటన జరిగింది వాస్తమే.. కానీ అది తమ సంకీర్ణ ఐక్యతపై ఎలాంటి ప్రభావాన్ని చూపలేదని చెప్పుకొచ్చారు. దాని గురించి సాంగ్లీ వాసులు మాట్లాడితే బాగుంటుందని దాటవేశారు. సాంగ్లీ.. దాని గురించి సాంగ్లీ వాసులు మాట్లాడితే బాగుంటుంది. అంతే కాకుండా ఇలాంటి ఘటనేం జరగలేదు. జిల్లా లేదా తాలూకా" అని పవార్ స్పష్టం చేశారు, కూటమి యొక్క సమైక్యతపై మద్దతుదారులు మరియు వ్యతిరేకులకు భరోసా ఇవ్వడమే లక్ష్యంగా పెట్టుకున్నారు.మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి అజిత్ పవార్ ఎన్నికల ప్రణాళికల చుట్టూ ఉన్న ఊహాగానాలు, ముఖ్యంగా అతను బారామతి నుండి పోటీ చేస్తారా లేదా అనే ఊహాగానాలు కూడా శరద్ పవార్ స్పందించారు. అజిత్ పవార్ తీసుకున్న ఏ నిర్ణయమైనా గత చర్యలపై ఆత్మపరిశీలన ద్వారా ప్రభావితమవుతుందని సూచించారు. "లోక్‌సభ ఎన్నికల్లో కుటుంబానికి వ్యతిరేకంగా పోరాడి తాను తప్పు చేశానని భావిస్తే, దానిని అసెంబ్లీలో పునరావృతం చేస్తారా అని ఆయనను అడగండి" అని పవార్ వ్యాఖ్యానించారు.

## అవసరమైతే రాహుల్ గాంధీ ఇంటి ముందు ధర్నా చేసి.. రుణమాఫీ చేయిస్తా

ఒక్క బస్సు తప్ప ఆరు గ్యారెంటీలు తుస్సే అని హరీశ్‌రావు మండిపడ్డారు. ప్రభుత్వం మాటలు నమ్మి రూ. 2 లక్షలపైన అప్పు కడితే రుణమాఫీ కాలేదు. రేవంత్ రెడ్డి ఇంకెప్పుడు చేస్తావ్. నీకు చెవులు, కళ్ళు ఉంటే చేయ్. రైతుల మీద మిత్తి పడుతున్నది. నువ్వు మాఫీ చెయ్యకుంటే పరిస్థితి ఏం కావాలి..? రెండు లక్షల రుణమాఫీ కాలేదని మహబూబాబాద్‌లో రవి ఆత్మహత్య చేసుకున్నాడు. సిద్దిపేట జిల్లాకు చెందిన సురేందర్ రెడ్డి అనే రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. రైతులు ఆత్మహత్యలు చేసుకుంటే రేవంత్ రెడ్డి కనిపించడం లేదా..? రైతుల కన్నీళ్లు చూస్తే రాతి గుండెలు కూడా కరుగుతాయి కానీ రేవంత్ రెడ్డి గుండె మాత్రం కరగడం లేదు అని హరీశ్‌రావు పేర్కొన్నారు.కరోనా సమయంలో ఎమ్మెల్యేలు, మంత్రులు, ప్రభుత్వ ఉద్యోగుల జీతాలు ఆపి.. రైతులకు మాత్రం రైతుబంధు ఆపకుండా కేసీఆర్ నిధులు విడుదల చేశారని హరీశ్‌రావు గుర్తు చేశారు. కేసీఆర్‌ది రైతు గుండె. అందుకే రైతుబంధు, రైతుబీమా, రుణమాఫీ చేశారు కేసీఆర్. అన్ని పంటలకు బోనస్ అని ఇప్పుడు సన్నాలకు మాత్రమే ఇస్తున్నారు. అన్ని రకాల వడ్లకు బోనస్ ఇవ్వాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.ప్రభుత్వం చేసిన మోసాలను ప్రతిపక్షంగా వెంటపడి అడుగుతాం. ఏడాదికి రెండు లక్షల ఉద్యోగాలు అన్నడు. పది నెలల్లో ఎన్ని ఇచ్చినవ్. కేసీఆర్ పరీక్షలు పెట్టిన 30,000 ఉద్యోగాలు తప్ప నువ్వు ఇచ్చిందేమీ లేదు. మిగిలిన రెండు నెలల్లో రెండు లక్షల ఉద్యోగాలు నింపుతావా..? డీఏలు ఇవ్వక ఉద్యోగులను మోసం చేసిండు. అన్ని వర్గాలకు రేవంత్ రెడ్డి అన్యాయం చేసిండు. రైతులేవరు అధైర్య పడొద్దు. బీఆర్ఎస్ పార్టీ మీకు అండగా ఉంటుంది. రేవంత్ రెడ్డి మెడలు వంచి మీకు రుణమాఫీ అమలు చేయిస్తాం అని హరీశ్‌రావు హామీ ఇచ్చారు.

## పెట్టుబడులకు భారత్ స్వీట్ స్పాట్‌గా మారింది

ఆయా దేశాలకు మన దేశం పట్ల ఉన్న నమ్మకానికి ఇదే నిదర్శనమని చెప్పారు. గడిచిన పదేళ్లలో చేపట్టిన సంస్కరణలే అందుకు కారణమన్నారు. ప్రపంచంలోనే భారత్ వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా ఉందని, ప్రస్తుతం ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా కొనసాగుతున్నామన్నారు.మొబైల్ ఫోన్ల తయారీలో రెండో స్థానంలో ఉన్నామని ప్రధాని చెప్పారు. 140 కోట్ల మంది భారతీయుల విశ్వాసమే మన బలమని పేర్కొన్నారు. భారత అభివృద్ధి కోసం మరిన్ని నిర్మాణాత్మక సంస్కరణలు తీసుకురావడానికి తాము కట్టుబడి ఉన్నామని చెప్పారు. గడిచిన పదేళ్లలో 25 కోట్ల మంది ప్రజలు పేదరికం నుంచి బయటపడ్డారని మోడీ వివరించారు.కౌటిల్య ఆర్థిక సదస్సు మూడో ఎడిసిన్ అక్టోబర్ 4 నుంచి 6 వరకు జరగనుంది. ప్రాముఖ్యంగా ఈ సదస్సులో కాన్క్లేవ్ గ్రీన్ ట్రాన్సిషన్, జియో-ఎకనామిక్ ఫ్రాగ్మెంటేషన్, అభివద్ధికి సంబంధించిన చిక్కులు, విధానపరమైన చర్యలు, సూత్రాలు వంటి అంశాలపై చర్చించనున్నారు. ఢిల్లీలోని తాజ్ ప్యాలెస్ హొటల్‌లో కౌటిల్య ఎకనామిక్ కాన్క్లేవ్ సదస్సు జరుగుతోంది. ప్రపంచ నలుమూలల నుంచి వచ్చిన వక్తులు ఈ సదస్సులో పాల్గొన్నారు. కౌటిల్య ఆర్థిక సదస్సును ఆర్థిక మంత్రిత్వ శాఖ భాగస్వామ్యంతో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎకనామిక్ గ్రోత్ నిర్వహిస్తోంది.

# క్షమాపణ చెప్పినా మంత్రి కొండా సురేఖను వదిలేలా లేరుగా!



శాసనసభ /హైదరాబాద్ : తెలంగాణ మంత్రి కొండ సురేఖ అక్కినేని కుటుంబం పైన, హీరోయిన్ సమంత పైన చేసిన వ్యాఖ్యలు రెండు తెలుగు రాష్ట్రాలలో ఇంకా దుమారం రేపుతూనే ఉన్నాయి. కొండా సురేఖ బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ను టార్గెట్ చేసి విమర్శలు గుప్పిస్తున్న క్రమంలో నాగార్జున ఫ్యామిలీని కూడా టార్గెట్ చేశారు.నాగచైతన్య సమంతల విడాకుల గురించి ఎవరు ఊహించని విధంగా సంచలన వ్యాఖ్యలు చేశారు కొండ సురేఖ.భగ్గుమన్న అక్కినేని ఫ్యాన్స్ తాజాగా రాష్ట్రవ్యాప్తంగా కొండా సురేఖ వ్యాఖ్యలతో అక్కినేని ఫ్యాన్స్ భగ్గుమంటున్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో అక్కినేని ఫ్యాన్స్ కొండా సురేఖ దిష్టిబొమ్మలను దగ్ధం చేస్తున్నారు. నిన్నటికి నిన్న వరంగల్లో కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలపై అక్కినేని అభిమానులు తీవ్రఆగ్రహం వ్యక్తం చేశారు. ఓవైపు వరంగల్ లో మంత్రి పర్యటిస్తుండగానే మరోవైపు మంత్రి కొండా సురేఖ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. అక్కినేని నాగార్జున కుటుంబానికి సమంతకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.తెలుగు రాష్ట్రాలలో కొండా సురేఖ దిష్టిబొమ్మ దగ్ధం ఇక తాజాగా నెల్లూరులోనూ అక్కినేని అభిమానులు కొండా సురేఖ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఇటు అక్కినేని ఫాన్స్ మాత్రమే కాదు బిఆర్ఎస్ మహిళా విభాగం కూడా రాష్ట్రవ్యాప్తంగా కొండా సురేఖ దృష్టి బొమ్మలను దగ్ధం చేసింది. రాష్ట్ర మంత్రి కొండ సురేఖ వ్యాఖ్యలు తెలుగు సమాజం సిగ్గుపడేలా ఉన్నాయని బిఆర్ఎస్ మహిళా విభాగం నేతలు మండిపడుతున్నారు. ఆమె దిష్టిబొమ్మలను కొండా సురేఖ బ్యానర్లను దగ్ధం చేసి తమ నిరసన వ్యక్తం చేశారు.మంత్రి పదవి తొలగించాలని డిమాండ్ కొండ సురేఖ చేసిన దారుణమైన వ్యాఖ్యలకు ఆమెను మంత్రి పదవి నుంచి తొలగించాలని వారు డిమాండ్ చేశారు. ఓవైపు కొండ సురేఖ చేసిన వ్యాఖ్యలతో దుమారం చెలరేగి అక్కినేని కుటుంబంతో పాటు సమంత కూడా స్పందించి తమను రాజకీయాల్లోకి లాగొద్దని ఎక్స్ వేదికగా పోస్టులు పెట్టారు. దీంతో కొండా సురేఖ కేటీఆర్ ని విమర్శిస్తున్న క్రమంలో భావోద్వేగానికి లోనై తను వ్యాఖ్యలు చేశానని తనను క్షమించాలని సమాధానం ఇచ్చారు.సోషల్ మీడియాలో కీర్తిశేషులు కొండా సురేఖ అంతలోనే మళ్లీ నేను ఏదైనా ఉన్నది ఉన్నట్టు మాట్లాడతానని చెప్పిన కొండ సురేఖ సమంత నాగచైతన్య విడాకుల విషయంలో నేను చెప్పిన కారణం కాకుంటే మరేం జరిగిందో ఎందుకు విడిపోయారో నాగార్జున చెప్పాలంటూ ప్రశ్నించారు. ఇక కొండా సురేఖ ధోరణి మారదని మరోమారు సోషల్ మీడియా వేదికగా ఆమెను ట్రోల్ చేస్తున్నారు. కీర్తిశేషులు కొండ సురేఖ అంటూ ఆమె ఫోటోలతో పోస్టులు పెడుతున్నారు. కారుకూతల కొండా సురేఖ.. నోటి దురద కొండా సురేఖ అంటూ సురేఖ పైన నిప్పులు చెరుగుతున్నారు.

( మొదటి పేజీ తరువాయి )

## విజిలెన్స్ విచారణ అనగానే సుబ్బారెడ్డి ఎందుకు భయపడ్డారు?

తిరుమల శ్రీవారి లడ్డూ కల్తీ వ్యవహారంలో నిగ్గు తేల్చేందుకు స్వతంత్ర సిట్ ను ఏర్పాటు చేయాలని ఇవాళ సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు ఇచ్చిన సంగతి తెలిసిందే. దీనిపై ఏపీ హోంమంత్రి వంగలపూడి అనిత స్పందించారు. వెంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదం విషయంలో సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నామని తెలిపారు. లడ్డూ వ్యవహారం అనేది సెంటిమెంట్లతో కూడిన విషయం అని, కల్తీ జరిగిందని తెలిశాక రాష్ట్ర ప్రభుత్వం ఏం చేయాలో అదే చేసిందని అన్నారు. కల్తీ జరిగిందన్న ఆరోపణలు రాగానే, వైసీపీ నేతలు ఎదురుదాడికి దిగారని విమర్శించారు.సరిగ్గా గమనిస్తే... తప్పు చేయని వాళ్లు భయపడరు... కానీ విజిలెన్స్ విచారణ అనగానే వైవీ సుబ్బారెడ్డి ఎందుకు భయపడ్డారు? అని అనిత ప్రశ్నించారు. ఈ అంశాన్ని కూడా సుప్రీంకోర్టు నేడు ప్రస్తావించిందని వెల్లడించారు. సుప్రీంకోర్టు ఇవాళ ఇచ్చిన తీర్పు తమకు ఆమోదయోగ్యమేనని... సీబీఐ అధికారులు, స్థానిక పోలీసు ఉన్నతాధికారులతో కూడిన సిట్ ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు చెప్పిందని వివరించారు. ఇప్పుడు నిజానిజాలు తేలాలి... సిట్ దర్యాప్తుతో వాస్తవాలేంటో అందరికీ తెలుస్తాయి అని అనిత స్పష్టం చేశారు.


## మీ వేషమేంటి పవన్ ? ఇతర మతాలు అక్కర్లేదా ?

ఒక మతమే ముఖ్యం అన్నట్లుగా పవన్ మాట్లాడుతున్నారని ఆక్షేపించారు.డిప్యూటీ సీఎంగా ఒక మతానికి చెందిన బట్టలు వేసుకుని డ్యూటీ చేస్తుంటే మిగతా మతాలకు అభద్రతా భావం కలగదా అని షర్మిల ప్రశ్నించారు. జనసేన సెక్యులర్ పార్టీ అనుకునే వాళ్లమని, కానీ ఇప్పుడు రైటిస్ట్ పార్టీ అని అర్థమవుతోందన్నారుఆరెస్సెస్ సిద్ధాంతాన్ని బీజేపీ అనుసరిస్తుందని, మీరు కూడా అనుసరిస్తున్నారా అని షర్మిల పవన్ ను ప్రశ్నించారు. మణిపూర్ లో బీజేపీ క్రైస్తవుల ఊచకోత చేస్తే పవన్ ఎందుకు మాట్లాడలేదని నిలదీశారు. మిగతా మతాలు అక్కర్లేదనుకుని పవన్ మాట్లాడుతున్నారన్నారు.మీరా రాహుల్ గాంధీపై మాట్లాడేది అని పవన్ ను షర్మిల ప్రశ్నించారు. రాహుల్ గాంధీ దేశ ప్రజల్లో ఐక్యత, సోదరభావం పెంపొందించడానికి కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకూ భారత్ జోడో యాత్ర చేసారని, అలాంటి వ్యక్తి గురించి మాట్లాడి పవన్ తన స్థాయి దిగజార్చుకున్నారని షర్మిల విమర్శించారు. మరోవైపు తిరుమల లడ్డూ వ్యవహారంపై సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నట్లు షర్మిల తెలిపారు. సీబీఐతో స్వతంత్ర దర్యాప్తు చేయించాలని ముందుగా కోరింది కాంగ్రెస్ పార్టీయే అన్నారు. దేవుడి దయతో సుప్రీంకోర్టు కూడా అదే తీర్పు ఇచ్చిందన్నారు. అలాగే సుప్రీంకోర్టు చెప్పినట్లుగా దీన్ని రాజకీయం చేయాల్సిన అవసరం లేదన్నారు.

## రాజకీయాల్లో ఉన్నప్పుడు నోరు జాగ్రత్తగా పెట్టుకొని మాట్లాడాలి

ఎవరి వ్యక్తిగత విషయాలతో రాజకీయాలు ముడి పెట్టడం సరికాదు అని బీజేపీ ఎంపీ సూచించారు. రాజకీయాల్లో ఉన్నప్పుడు నోరు జాగ్రత్తగా పెట్టుకొని మాట్లాడాలి అని డీకే అరుణ తెలిపారు.ఇక, ఒకసారి మాట్లాడి మళ్లీ వెనక్కు తీసుకోలేమని మాజీమంత్రి, బీజేపీ ఎంపీ డీకే అరుణ అన్నారు. రాజకీయ నాయకులు ఆవేశం వచ్చినా ఆలోచించి మాట్లాడాలి.. ఒకరి మీద కోపం ఇంకొకరి మీద తీయడం సరికాదు అని చెప్పారు. ఒక మహిళను పట్టుకొని, సినిమా కుటుంబాన్ని కించపరిచే విధంగా మాట్లాడం కరెక్ట్ కాదు అని పేర్కొన్నారు. అలాగే, భాగ్యలక్ష్మీ అమ్మవారి ఆగ్రహానికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం గురి కావొద్దు అని తెలిపారు. అమ్మవారి ఆలయం దగ్గర మహిళలు బతుకమ్మ ఆడటానికి కోర్టు పర్మిషన్ తీసుకోవాల్సి వచ్చింది.. తెలంగాణ రాష్ట్రంలో మళ్లీ నియంతృత్వ పాలనా కొనసాగుతుందని డీకే అరుణ చెప్పుకొచ్చారు.

# హైడ్రా కూల్చివేతలపై హైకోర్టు కీలక వ్యాఖ్యలు!




శాసనసభ /హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యంగా హైదరాబాద్లో చెరువులు, నాలాలను కబ్జా చేసి, ఎఫ్టీఎల్ పరిధిలోనూ, బఫర్ జోన్స్ లోనూ నిర్మించిన కట్టడాలను గుర్తించి వాటిని కూల్చివేయడం లక్ష్యంగా పెట్టుకొని దూసుకుపోతున్న హైడ్రా వ్యవస్థ పైన పెద్ద ఎత్తున చర్చ జరుగుతుంది.అయితే మొదట సంపన్నుల ఆక్రమణలను హైడ్రా కూల్చివేస్తున్నట్టు హైడ్రాకు విపరీతమైన మైలేజ్ వచ్చింది.హైడ్రాపై మొదలైన వ్యతిరేఖత నాగార్జున ఎన్ కన్వెన్షన్ కూల్చివేతతో ప్రజల్లోకి ఈ విషయం వెళ్ళింది. అప్పుడు హైడ్రా కూల్చివేతలపైన సర్వత్ర హర్షం వ్యక్తం అయింది. అయితే ఆ తరువాత పరిణామాలలో హైడ్రా సామాన్య మధ్యతరగతి ప్రజల నివాసాలను కూడా కూల్చివేస్తుండడంతో రాష్ట్రవ్యాప్తంగా హైడ్రా పైన వ్యతిరేకత మొదలైంది. పేద మధ్యతరతి వర్గాల వారు హైడ్రా కూల్చివేతలతో కన్నీరు పెట్టుకుంటున్న అనేక వీడియోలు సోషల్ మీడియాలో హల్చల్ చేస్తున్నాయి.హైడ్రా కూల్చివేతలపై హైకోర్టు విచారణ ముఖ్యంగా ఆపరేషన్ మూసి చేపట్టి మూసి పరివాహక ప్రాంతాలలో ఉన్న ఆక్రమణలను కూల్చివేయాలని నిర్ణయించడంతో మరింత వ్యతిరేకత పెరిగి హైడ్రా వ్యవస్థ పైన ప్రతిపక్ష పార్టీలు కూడా రేవంత్ సర్కార్ను టార్గెట్ చేస్తున్న పరిస్థితి వచ్చింది. అయితే తాజాగా హైడ్రా కూల్చివేతలపై హైకోర్టులో ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కే ఏ పాల్ ఒక పిటిషన్ దాఖలు చేయగా దానిపైన హైకోర్టు ధర్మాసనం విచారించింది.తేల్చి చెప్పిన హైకోర్టు ధర్మాసనం ఇప్పటికిప్పుడు హైడ్రా కూల్చివేతలను ఆపలేమని హైకోర్టు ధర్మాసనం తేల్చి చెప్పింది. హైడ్రా కూల్చివేతలను తక్షణమే ఆపాలని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ దాఖలు చేసిన పిటిషన్ నేపథ్యంలో విచారణ జరిపిన హైకోర్టు ఈ విషయాన్ని వెల్లడించింది. జీవో నెంబర్ 99 పై స్టే విధించాలని, కూల్చివేతలను తక్షణమే ఆపేయాలని కేఏ పాల్ కోర్టుకు విజ్ఞప్తి చేశారు.హైడ్రా కూల్చివేతలపై కోర్టులో విచారణ వాయిదా అంతే కాదు హైడ్రాకు చట్టబద్ధత కల్పించాలని, అక్రమ కట్టడాల కూల్చివేతలకు నెల రోజుల ముందే నోటీసులు ఇవ్వాలని కూడా ఆయన తన పిటిషన్ లో కోరారు. ఇక పిటీషనర్ తరపు వాదనలు విన్న ధర్మాసనం ప్రతివాదుల కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను అక్టోబర్ 14వ తేదీకి వాయిదా వేసింది.అక్టోబర్ 14న మళ్ళీ విచారణ కోర్టు ఈ కేసులో ప్రతివాదులైన హైడ్రాకు, రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు పంపించింది. దీనిపైన కౌంటర్ దాఖలు చేయాలని హైకోర్టు ధర్మాసనం సూచించింది. మరి అక్టోబర్ 14న హైడ్రా ఈ కేసు విచారణ జరపనున్న నేపథ్యంలో హైడ్రా, రాష్ట్ర ప్రభుత్వం కౌంటర్ ఏమని దాఖలు చేస్తారో వేచి చూడాలి.

# మోడీ దేవుళ్ళ పేరుతో రాజకీయం, ఓట్ల బిక్షాటన చేస్తున్నారు..




శాసనసభ /హైదరాబాద్ : బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలపై టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఫైర్ అయ్యారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ దేవుళ్ళ పేరుతో రాజకీయం, ఓట్ల బిక్షాటన చేస్తున్నారు అని మండిపడ్డారు.కులం, మతం, శ్రీరాముడు, హనుమంతుడు పేర్లతో ఓట్లు అడుగుతున్నారని అన్నారు. అభివృద్ధి ధ్యేయంగా ప్రజల కోసం వెళ్తున్న సెక్యులర్ పార్టీ కాంగ్రెస్ కు ప్రజలు అండగా నిలవండి కోరారు. పెద్ద పెద్ద కంపెనీలు అదాని, అంబానీలకీ కట్టబెట్టారు అని ఆయన ఆరోపించారు. అప్పులు చేసి కేసీఆర్ ఫాంహౌస్ కు పరిమితం అయ్యారు.. ఇక, కేటీఆర్, హరీశ్ రావు అబద్ధపు మాటలు మాట్లాడుతున్నారు.. ఆ పార్టీకి ప్రతిపక్ష హెూదా అవసరమా..? అని మహేష్ కుమార్ గౌడ్ అడిగారు.ఇక, పీసీసీ అధ్యక్ష పదవి కోసం చివరి వరకు ప్రచార కమిటీ ఛైర్మన్ మధు యాష్కీతో ఆహ్లాదకరమైన పోటీ పడ్డామని మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. ఆఖరి వరకు పోటీ ఉన్న కలిసి పోయే తత్వం కాంగ్రెస్ పార్టీలో ఉంటాయి.. మధు యాష్కీ నాకు పెద్దన్న లాంటి వారు.. రాజకీయ విభేదాలు ఉన్న డీఎస్ నా రాజకీయ గురువే అని చెప్పుకొచ్చారు. నేను రాజకీయ కుటుంబం నుంచి రాలేదు, మాది వ్యవసాయ కుటుంబం.. నక్సల్ ప్రభావిత ప్రాంతం నుంచి నిజామాబాద్ కు వచ్చాను.. రాజకీయాల్లో పనీ చేసుకుంటూ అవకాశం వస్తుంది అని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ వెల్లడించారు.

# పార్టీకి చెడ్డ పేరు వస్తే నా కాంగ్రెస్ రక్తం సహించదు..

## సీఎం రేవంత్ రెడ్డికి కేవీపీ లేఖ



శాసనసభ /హైదరాబాద్ : ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, వైఎస్ రాజశేఖర్ రెడ్డి సహచరుడు కేవీపీ రామచంద్రరావు స్పందించారు.తన ఫామ్ హౌస్కు అధికారులను పంపించాలని కోరారు. 'ఎఫ్టీఎల్, బఫర్ జోన్లో నిర్మాణం ఉంటే మార్క్ చేయించండి. నేనే నా సొంత ఖర్చులతో ఆ నిర్మాణాలను కూల్చివేయిస్తా' అని కేవీపీ రామచంద్రరావు స్పష్టం చేశారు. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డికి శుక్రవారం (అక్టోబర్ 4) లేఖ రాశారు కేవీపీ.'చట్టం నుంచి నాకు ఎలాంటి మినహాయింపులు వద్దు. చట్టం తన పని తాను చేసుకుపోనివ్వండి. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎలాంటి చెడ్డ పేరు రాకూడదు. పార్టీకి చెడ్డ పేరు వస్తే, నా కాంగ్రెస్ రక్తం సహించదు' అని లేఖలో కేవీపీ రామచంద్రరావు పేర్కొన్నారు.

# ఎన్నికల హామీలు విఫలమై హైడ్రా..

# చివరకు సినీ తారలు: జగదీష్ రెడ్డి





శాసనసభ /హైదరాబాద్ : తెలంగాణ మంత్రి కొండా సురేఖ మాటలు ఆమె మానసిక స్థితిపై అనుమానాలు వచ్చేలా ఉన్నాయని ఎద్దేవా చేశారు మాజీ మంత్రి జగదీష్ రెడ్డి.ఇదే సమయంలో మంత్రుల వెనుక సీఎం రేవంత్ ఉండి ఇలా వారితో మాట్లాడిస్తున్నారని ఆరోపించారు. ఇచ్చిన హామీలు విఫలమై హైడ్రా.. అలాగే, హైడ్రా విఫలమై సినీ తారల అంశం తెరపైకి తెస్తున్నారని ఆసక్తికర కామెంట్స్ చేశారు.మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో స్థాయిలేని వారికి మంత్రి రావడంతో అడ్డగోలుగా మాట్లాడుతున్నారు. ఎవరో ఆకతాయిలు సోషల్ మీడియాలో చేసిన పనులకు కేటీఆర్కు ఏం సంబంధం ఉంది?. రేవంత్ వెనకుండి మంత్రులతో ఇలా మాట్లాడిస్తున్నారు. కొండా సురేఖ మాటలు సొంత పార్టీ నాయకులు సైతం సిగ్గుపడేలా ఉన్నాయి. హామీల అమలులో విఫలమై కాంగ్రెస్ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోంది. హామీలు విఫలమై హైడ్రాను ముందుకు తెచ్చారు. హైడ్రా కూడా విఫలం కావడంతో సినీ తారల అంశం తెరపైకి తెస్తున్నారు.రేవంత్ డైవర్షన్ రాజకీయాలతో కుటుంబాలు నాశనం అయ్యేలా ఉన్నాయి. కేసీఆర్ కనపడటం లేదంటే కొండా మురళీ కనపడటంలేదని కొందరు మీమ్స్ పెడుతున్నారు. మనుషులను మాయం చేసే చరిత్ర మీది. చిల్లర మాటలు అనడం, అనిపించుకోవడం ఎందుకు. మంత్రి కోమటిరెడ్డి మానసిక స్థితి కూడా సరిగా లేదు. కాంగ్రెస్, బీఆర్ఎస్ హయాంలో మూసీ పరిస్థితిపై కోమటిరెడ్డి చర్చకు సిద్ధమా?. మూసీ దుస్థితికి కారణం కాంగ్రెస్ పార్టీనే. మూసీ ప్రక్షాళన కాదు సీఎం, మంత్రుల బుర్రలు ప్రక్షాళన చేయాలి. మూసీ మురికి కన్నా ఎక్కువ కలుషితమైన కాంగ్రెస్ ఆలోచనల సుందరీకరణ జరగాలి' అంటూ ఘాటు విమర్శలు చేశారు.

# తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీపై సంచలన నిర్ణయం తీసుకున్న రేవంత్ రెడ్డి



శాసనసభ /హైదరాబాద్ : తెలుగు సినీ పరిశ్రమపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మండిపడుతున్నారు. ప్రభుత్వానికి సహకారం అందించాల్సిన సమయంలో ఏ స్పందనా లేకుండా మౌనంగా ఉండి, ఇప్పుడు కొండా సురేఖపై మూకుమ్మడిగా ఖండనలిస్తుండటం తో రేవంత్ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది.హైదరాబాద్ లో డ్రగ్స్ వాడకం ఎక్కువగా ఉందని, డ్రగ్స్ వాడొద్దంటూ యువతకు సూచించేవిధంగా సినీ రంగంలోని సెలబ్రిటీలంతా ముందుకు రావాలని, వారిని చైతన్యపరచాలని కోరితే ఇంతవరకు ఒక్కరు కూడా స్పందించలేదు. కేవలం చిరంజీవి, జూనియర్ ఎన్టీఆర్ మాత్రమే వీడియోలు చేసి విడుదల చేశారు.ఒక్కరు కూడా ముందుకు రాలేదు టికెట్ ధరలను పెంచుకోవడానికి మాత్రం ప్రభుత్వాన్ని ఆశ్రయిస్తున్న సినీ ప్రముఖులు నంది అవార్డు స్థానంలో గద్దర్ పేరుతో అవార్డులిస్తామంటే ఒక్కరు కూడా ముందుకు రాలేదు. దీనిపై మాట్లాడలేదు. మరోవైపు ఏపీ ప్రభుత్వం నుంచి గత ఐదు సంవత్సరాల్లో సినీ పరిశ్రమకు ఎక్కడా సహకారం అందలేదు. అయితే గత పది సంవత్సరాల్లో భారత రాష్ట్ర సమితి ప్రభుత్వంతో సినీ పరిశ్రమకు సత్సంబంధాలే ఉండేవి. అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి సర్కారు మాత్రం పరిశ్రమకు అనుకూలంగానే ఉంది. అయితే హైడ్రా కూల్చివేతల్లో భాగంగా నాగార్జున ఎన్ కన్వెన్షన్ కేంద్రాన్ని కూల్చేశారు.
సానుకూలత అవసరంలేదు కొండా సురేఖ కేటీఆర్ పై వ్యాఖ్యలు చేసే క్రమంలో నాగార్జున కుటుంబాన్ని, సమంతను బయటకు లాగడంతో సినీ పరిశ్రమ మొత్తం ఒక్కసారిగా ప్రభుత్వంపై తిరగబడినట్లైంది. సురేఖ వ్యాఖ్యలపై ప్రముఖులంతా మండి పడుతున్నారు. ఈ విషయాన్ని ఇంతటితో వదిలేయాల ని పెద్దది చేయొద్దంటూ పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ సినీ పరిశ్రమకు విజ్ఞప్తి చేశారు. బాలయ్య, పవన్ కల్యాణ్ మాత్రం స్పందించలేదు. సినీ పరిశ్రమ అతిగా స్పందిస్తోందని సీఎం రేవంత్ భావిస్తున్నారు. కొండా సురేఖ తన వ్యాఖ్యలను ఉపసంహరించుకున్న తర్వాత కూడా సినీ పెద్దలు స్పందించడం ముఖ్యమంత్రికి నచ్చలేదు. పరిశ్రమపై సానుకూలంగా ఉండాల్సిన అవసరం లేదని రేవంత్ రెడ్డి నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. భవిష్యత్తులో టికెట్ ధరలు పెంచుకుంటామని వచ్చినప్పుడు, అది కావాలి, ఇది కావాలంటూ వచ్చినప్పుడు అప్పటి సందర్భాన్ని చూడాలేకానీ వెంటనే స్పందించాల్సిన అవసరం లేకుండా చూడాలని రేవంత్ భావిస్తున్నట్లు తెలుస్తోంది.

# మరో 20 లక్షల మందికి త్వరలోనే రుణమాఫీ..



శాసనసభ /హైదరాబాద్ : రుణమాఫీ గురించి పట్టించుకోని పార్టీలు ప్రస్తుతం మాట్లాడుతున్నాయని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. రైతన్నల ఆదరణతో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది..కష్టమైనా ఒక పథకాన్ని ఆపైన సరే రుణమాఫీ, రైతు భరోసా, రైతు బీమాను అమలు చేస్తాం.. అన్ని సబ్సిడీ పథకాలను మళ్లీ పునరుద్ధరిస్తాం.. ఖచ్చితంగా రెండు లక్షల వరకు రుణమాఫీ చేసి తీరుతాం అననారు. ఏ ఒక్క రైతు కూడా అధైర్య పడవద్దు అని కోరారు. అలాగే, రైతులకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ.. 25 వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశాం.. మరో 25 వేల కోట్లు రైతుల ఖాతాలోకి రావాల్సినవి ఉన్నాయి.. మరో 20 లక్షల మంది రైతులకు త్వరలో రైతు రుణ మాఫీ డబ్బులు జమ చేస్తామని ఆయన చెప్పుకొచ్చారు. రుణ మాఫీ పూర్తి చేసి రైతు భరోసా ప్రారంభిస్తామని తుమ్మల నాగేశ్వర రావు వెల్లడించారు.అలాగే, భారతదేశంలో ఎక్కువ పంటలను సాగు చేసే ఏకైక రాష్ట్రం తెలంగాణ అని మంత్రి తుమ్మల తెలిపారు. మన రాష్ట్రంలో ఒక కోటి 45 లక్షల టన్నుల వరి ధాన్యం పండిస్తున్నాం.. ఏ ఒక్క రైతు ఇబ్బంది పడకుండా సీఎం రేవంత్ రెడ్డి కష్టపడుతున్నాడు.. ఈ సీజన్లో రైతులు ఎక్కువగా సన్న ధాన్యాన్ని పండించారు.. 500 రూపాయలు అదనంగా ఇచ్చి సన్న ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ను అధికారంలోకి తేవడానికి పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ప్రధాన పాత్ర పోషించారు అని తుమ్మల నాగేశ్వర్ రావు తెలిపారు. భవిష్యత్ లో కాంగ్రెస్ కు మంచి భవిష్యత్ ఉండాలనే మహేష్ కు పీసీసీ పదవి ఇచ్చింది.. రాష్ట్రంలో ఈ సీజన్ లో కోటి 43 లక్షల టన్నుల ధాన్యం పండుతుంది.. దేశంలోనే ఇది అత్యధిక దిగుబడి.. రైతులు ఎన్ని సన్నాలు పండించిన 500 బోనస్ ఇచ్చి కొనుగోలు చేస్తాం.. రాష్ట్రంలోని అన్ని జిల్లాలో ఆయిల్ ఫాల్ ఫ్యాక్టరీల ఏర్పాటుకు కృషి చేస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు చెప్పుకొచ్చారు.

# రుణమాఫీ విషయంలో ఏ ఒక్క రైతుకు అన్యాయం జరిగినా ఊరుకోం..



శాసనసభ /హైదరాబాద్ : రైతులు పండించిన దొడ్డు వడ్లకు రూ. 500 బోనస్ వెంటనే చెల్లించాలని మాజీమంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. ఈరోజు జరిగిన సమావేశంలో ప్రభుత్వం కేవలం సన్న వడ్లకే 500 రూపాయలు బోనస్ అని ప్రకటించడం పైన ఆగ్రహం వ్యక్తం చేశారు.ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీని ప్రభుత్వం నిలబెట్టుకోవాలి అన్నారు. మూసీ ప్రక్షాళన కోసం రూ. లక్షా 50 వేల కోట్లు అంటున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతులకు రైతు భరోసాకి, దొడ్డు వడ్ల బోనస్ కు పైసలు లేవా అని ప్రశ్నించారు. లక్షలాది మంది రైతులకు పంగనామాలు పెడతామంటే ఊరుకోం.. వానాకాలం సీజన్ పూర్తి అవుతున్న రైతు భరోసా ఊసేలేదు అని కేటీఆర్ మండిపడ్డారు.ఇక, మీ ముడుపుల మూసీ కోసం లక్షా 50 వేల కోట్ల రూపాయలు ఉంటాయి.. రైతులకు ఇచ్చేందుకు డబ్బులు లేవా? అని మాజీ మంత్రి కేటీఆర్ విమర్శించారు. ఇప్పటికైనా అవినీతి ఆలోచనలు మానేసి.. రైతులకిచ్చిన హామీలపై దృష్టి పెట్టు అని సూచించారు. రైతు రుణమాఫీ విషయంలో ఏ ఒక్క రైతుకు అన్యాయం జరిగినా ఊరుకోం అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కేటీఆర్ హెచ్చరించాడు. రాష్ట్ర ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీని నెలబెట్టుకునే వరకు తమ పోరాటం కొనసాగుతుందన్నారు. అలాగే, సంపూర్ణ రైతు రుణామాఫీ పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

# చెన్నూరులో ఉప ఎన్నిక ఖాయం: బాల్క సుమన్



శాసనసభ /హైదరాబాద్ : సూటు కేసు కంపెనీలకు డబ్బులు పంపిన వ్యవహారంలో చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ జైలు పోవటం ఖాయమన్నారు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్.సీఎం రేవంత్ కాదు కాదా.. భగవంతుడు కూడా వివేక్ను కాపాడలేరు అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు.బీఆర్ఎస్ నేత బాల్క సుమన్ శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ..చెన్నూరు నియోజకవర్గానికి ఉప ఎన్నికలు పక్కా జరుగుతాయి. సూటు కేసు కంపెనీలకు డబ్బులు పంపిన వ్యవహారంలో చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ జైలు పోవటం ఖాయం. సీఎం రేవంత్ రెడ్డి.. వివేక్ను కాపాడే ప్రయత్నం చేస్తున్నారు. రేవంత్ రెడ్డి కాదు కదా.. భగవంతుడు కూడా వివేక్ను కాపాడలేడు.ఈడీ కేసు జరుగుతుంటే.. తెలంగాణ పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారు. వివేక్ కేసు వ్యవహారంలో సుప్రీంకోర్టు వరకు వెళ్తాం. వివేక్.. అక్రమంగా వందల కోట్ల రూపాయలను ఖర్చు చేసి ఎన్నికల్లో గెలిచాడు. తెలంగాణ పోలీసులకు స్వామి భక్తి ఎక్కువైంది. పోలీసులు.. రేవంత్ రెడ్డి అడుగులకు మడుగులు ఒత్తుతున్నారు. అత్యుత్సాహం ప్రదర్శిస్తోన్న పోలీసులు భవిష్యత్తులో బలికాక తప్పదు. ఈడీ విచారణ జరుగుతున్న కేసును పోలీసులు క్లోజ్ చేసే ప్రయత్నం చేస్తున్నారు అంటూ సంచలన ఆరోపణలు చేశారు.ఇదిలా ఉండగా.. ఈ ఏడాది జనవరిలో చెన్నూరు కాంగ్రెస్ ఎమ్మెల్యే వివేక్.. ఈడీ విచారణకు హాజరయ్యారు. విశాఖ ఇండస్ట్రీస్, ఎంఎస్ విజిలెన్స్ సెక్యూరిటీస్ లావాదేవీల వ్యవహారంలో ఈడీ విచారణకు హాజరయ్యారు. రూ. 8కోట్ల బ్యాంకు లావాదేవీలపై గతంలో తెలంగాణ పోలీసులు కేసు నమోదు చేశారు. అలాగే ఎన్నికల సమయంలో విశాఖ ఇండస్ట్రీస్, ఎంఎస్ విజిలెన్స్ సెక్యూరిటీ సర్వీసెస్ మధ్య జరిగిన రూ.100 కోట్ల లావాదేవీల వ్యవహారంలో మనీలాండరింగ్ చట్టం కింద ఈడీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తోంది. దీనిపై వివేక్ను ఈడీ ప్రశ్నించింది. గత ఏడాది నవంబర్లో విశాఖ సంస్థల్లో ఈడీ అధికారులు సోదాలు చేశారు. విజిలెన్స్ సెక్యూరిటీ సర్వీసెస్ బోగస్ సంస్థ అని గుర్తించి కోట్ల విలువైన ఆస్తులకు సంబంధించిన పత్రాలను స్వాధీనం చేసుకున్నారు.

# రుణమాఫీ విషయంలో వెనుకడుగు వేయలేదు..



శాసనసభ /హైదరాబాద్ : రుణమాఫీ విషయంలో వెనుకడుగు వేయలేదు అని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. సాంకేతిక సమస్యలతో ఇబ్బందులు వచ్చాయి.. త్వరలో మిగిలిపోయిన రైతుల ఖాతాల్లో రుణ మాఫీ డబ్బులు జమ చేస్తామన్నారు.కాంగ్రెస్ పార్టీని సంస్థగతంగా బలోపేతం చేయాలి.. ఆర్థిక వ్యవస్థను గత ప్రభుత్వం అస్తవ్యస్తంగా చేశారు.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడుతున్నారు అని చెప్పుకొచ్చారు.అలాగే, భావితరాలకు దశ దిశ నిర్దేశించి జీవితం అంకితం చేసిన నాయకులు జువ్వాడి రత్నాకర్ రావు అని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. మా నాన్న గారు చనిపోయినప్పుడు నన్ను రత్నాకర్ రావు, జీవన్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి రాజకీయాలలోకి తీసుకొచ్చారు.. శాసనసభ్యునిగా, జిల్లా అధ్యక్షులుగా నేను ఉన్నప్పుడు నా వెనుక ఉండి నడిపించింది రత్నాకర్ రావు, జీవన్ రెడ్డి అని చెప్పుకొచ్చారు. పేదలకు లబ్ధి చేయాలని అండగా ఉండాలని తాపత్రయపడే నాయకులు రత్నాకర్ రావు.. దేవాదాయ శాఖ మంత్రిగా దీప దీప నైవేద్య కార్యక్రమం చేపట్టి దేవాలయాలలో దీపం వెలిగించి ఆదర్శంగా నిలిచారు.. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోనే కాకుండా రాష్ట్రంలోనే కీలక నాయకుడు జువ్వాడి రత్నాకర్ రావు.. రైతులకు ఉపయోగపడే విధంగా రాజశేఖర్ రెడ్డి వెంటపడి కోరుట్లలో వెటర్నరీ కాలేజ్ ఏర్పాటు చేసిన మహనీయుడు.. దీంతో ఇక్కడ ఎందరో యువకులకు ఉద్యోగ అవకాశం కలిగింది అని శ్రీధర్ బాబు చెప్పుకొచ్చారు.

# నా ఫామ్ హౌజ్ పక్కనే సబితా, పొంగులేటి ఫామ్ హౌజ్ లు ఉన్నాయి..



శాసనసభ /హైదరాబాద్ : సబితా ఇంద్రారెడ్డికి, పొంగులేటి శ్రీనివాసరెడ్డికి ఇద్దరికి నా ఫామ్ హౌజ్ పక్కనే ఫామ్ హౌజ్ లు ఉన్నాయని తెలంగాణ శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి అన్నారు.కేటీఆర్, హరీష్, సబితా ఇంద్రారెడ్డికి చెప్పేది ఒకటే.. నా ఫామ్ హౌజ్ రూల్స్ ప్రకారం ఉందన్నారు. రూల్ ప్రకారం లేదంటే నేనే దగ్గర ఉండి కూల్చివేస్తా అన్నారు. ప్రతీ సారి నా పేరు తీసుకుని విమర్శలు చేస్తున్నారు. నేను మంత్రిగా పని చేసిన.. భాద్యత ఉన్న వ్యక్తిని అని గుర్తు చేశారు. నిబంధనల మేరకే ఫామ్ హౌజ్ ఉందని అధికారులు నాకు నివేదిక ఇచ్చారన్నారు. ఎఫ్టీఎల్, బఫర్ జోన్ లో నా ఫామ్ హౌజ్ నిర్మాణం చేయలేదన్నారు. రింగ్ రోడ్డు మీద నుంచి చూస్తే గుట్టల మీద ఉంటది. నీళ్ళు ఉన్నట్లు కనిపిస్తోందని క్లారిటీ ఇచ్చారు. నా ఫామ్ హౌజ్ 20 ఏళ్ల క్రితం కట్టామన్నారు.111 జీవో సుప్రీం కోర్టు పరిధిలో ఉంది. రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో లేదన్నారు. అధికారుల నుంచి నాకు ఎలాంటి నోటీసులు రాలేదన్నారు. కేటీఆర్ జన్వాడ ఫామ్ హౌజ్ కు పర్మిషన్ ఉందా? లేదా ? నాకు తెలియదన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ఫామ్ ఉంటే కూల్చి వేయాల్సిందే అన్నారు. సబితా ఇంద్రారెడ్డికి, పొంగులేటి శ్రీనివాసరెడ్డికి ఇద్దరికి నా ఫామ్ హౌజ్ పక్కనే ఫామ్ హౌజ్ లు ఉన్నాయని తెలిపారు. నిన్న తెలంగాణ శాసనమండలి చీఫ్ విప్గా పట్నం మహేందర్రెడ్డి నియమితులైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పట్నం మహేందర్రెడ్డి ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. కాగా తాను చీఫ్ విప్గా నియమించిన సందర్భంగా రేవంత్రెడ్డిని తన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశానని పట్నం స్పష్టంచేశారు. అంతేకాకుండా.. బొకే అందించి, శాలువాతో సన్మానించి, ఆయనకు ధన్యవాదాలు తెలియజేశానని ఎక్స్ ఖాతాలో పేర్కొన్నారు.

# అల్లు అర్జున్ తొలిసినిమా ఆగిపోయింది తెలుసా?



'పుష్ప' చిత్రంతో పాన్ ఇండియా స్టార్‌గా, ప్రపంచవ్యాప్తంగా పాపులారిటిని సంపాదించుకున్నారు హీరో అల్లు అర్జున్. ప్రస్తుతం పుష్ప-2 చిత్రంలో నటిస్తున్నాడు ఈ ఐకాన్‌స్టార్. సుకుమార్ దర్శకత్వంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందుతున్న ఈ చిత్రంలో పుష్పరాజ్‌గా మరోసారి ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమవుతున్నాడు. డిసెంబరు 6న చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.ఇదిలా వుండగా సాధారణంగా అందరూ అల్లు అర్జున్ హీరోగా నటించిన తొలిచిత్రం గంగోత్రి అనుకుంటారు. అయితే గంగోత్రి కంటే ముందు అల్లు అర్జున్ ఓ సినిమా ఆగిపోయిందట. ఇటీవల ఆ విశేషాలను అల్లు అర్జున్ ఓ ఇంటర్వ్యూలో పంచుకున్నాడు ఆయన మాట్లాడుతూ ' యానిమేటర్‌గా స్థిరపడదామని కెనడాకు వెళ్లడానికి రెడీ అయిన తరుణంలో ఓ సినిమాలో నటిస్తే జీవితాంతం మెమెరబుల్‌గా వుంటుంది కదా అనిపించింది. తెలిసిన స్నేహితుల ద్వారా అవకాశం కూడా వచ్చింది.మూడు నెలల్లో ఆ సినిమా పూర్తిచేసి కెనడా వెళ్లిపోవచ్చని డిసైడ్ అయ్యాను. కానీ ఎవో అనివార్య కారణాల వల్ల ఆ సినిమా మొదలుకాకముందే ఆగిపోయింది. తొలిసినిమా అలా ఆగిపోవడం బాధ కలిగింది. అప్పటి నుంచి సినిమాల మీద శ్రద్ధ పెట్టాను. యానిమేటర్‌గా అయితే ఆ రంగంలో రాణించాలంటే ఎక్కువ టైమ్ పడుతుంది. నాకున్న నట వారసత్వంను వదిలి యానిమేటర్‌గా ఎందుకు వెళ్లాలి అనుకున్నాను. అది సరియైన నిర్ణయం కాదనిపించింది. ముందు ఓ సినిమాలో ప్రయత్నిద్దాం. సక్సెస్ కాకపోతే అప్పుడు ఆలోచిద్దాం అనుకున్నాను. ఇదే విషయాన్ని నాన్నకు చెప్పాను. ఆ తరువాత ముంబైలో కిశోర్ నమిత్‌కుమార్ ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌లో నటనలో శిక్షణ పొందాను. కోర్సు పూర్తవగానే గంగోత్రిలో అవకాశం వచ్చింది' అని చెప్పుకొచ్చారు

# బాలకృష్ణకు వ్యతిరేకంగా పోసాని సంచలన వ్యాఖ్యలు..!



అక్కినేని నాగార్జున కుటుంబం – తెలంగాణ మంత్రి కొండా సురేఖ మధ్య వివాదంపై పోసాని కృష్ణమురళి స్పందించారు. గతంలో పవన్ మీద వాఖ్యలు చేస్తే స్పందించని నోర్లు అని నాకు ఆపాదిస్తున్నారని, నిన్న ఒకడు నన్ను కత్తితో పొడుస్తా అన్నాడని ఆయన చెప్పారు.నేను పవన్‌ను గతంలో తిట్టినట్లు చూపిస్తే నేను లైవ్‌లో గొంతు కోసుకుని చనిపోతానని పోసాని అన్నారు.గతంలో పవన్, చంద్రబాబు కుటుంబం తిట్టుకున్నారని, నా కుటుంబాన్ని పవన్ అభిమానులే అమ్మనా బూతులు తిట్టించారని చెప్పారు. అప్పుడు నన్ను నా కుటుంబాన్ని తిట్టినందుకు ఎవరు నాకు మద్దతు తెలుపలేదన్నారు. సినిమా ఇండస్ట్రీ పరువు కోసం ప్రతిసారి తాను ముందుకు వచ్చానని, సినిమా కళామతల్లి తన కన్న తల్లి అని చెప్పారు. ప్రతిసారి న్యాయం వైపే ఉంటానని అన్నారు.నాగార్జున కుటుంబం మీద జరిగిన మాటల దాడిని సినిమా ఇండస్ట్రీలో ప్రతి ఒక్కరు ఖండించారని, కానీ బాలకృష్ణ కుటుంబం మాత్రం ఖండించలేదని పోసాని అన్నారు. 'ఆడపిల్లలకు కడుపు ఐనా చేయాలి.. ముద్దు ఐనా పెట్టాలి' అని చెప్పిన బాలకృష్ణ నుంచి మనం క్షమాపణ కోరుకోగలమా..? అని ప్రశ్నించారు. చివరగా.. కొండా సురేఖ గారు జెంటిల్ మెన్ నాగార్జున కుటుంబానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.



# ఆ విషయంలో నేను సింహాన్నే.. అక్కినేని నాగార్జున సంచలన పోస్ట్.



టాలీవుడ్ అగ్రకథానాయకుడు అక్కినేని నాగార్జున కుటుంబం గురించి తెలంగాణ మంత్రి కొండా సురేఖ సంచలన కామెంట్స్ చేసిన సంగతి తెలిసిందే. ఆమె చేసిన వ్యాఖ్యలపై సినీ ఇండస్ట్రీ మొత్తం మండిపడుతుంది.అటు సినీ ప్రముఖులతోపాటు రాజకీయ నాయకులు సైతం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అలాగే కొండా సురేఖ చేసిన కామెంట్స్ పై నటుడు నాగార్జున ఆమెపై పరువు నష్టం దావా వేశారు. తన కుటుంబ పరువుకు నష్టం కలిగించారని పిటిషన్ లో పేర్కొన్నారు. ఈ కేసుపై ఈరోజు విచారణ జరగాల్సి ఉండగా.. న్యాయమూర్తి సెలవులో ఉ ండడంతో ఈ కేసు విచారణ సోమవారానికి వాయిదా పడింది. అక్కినేని ఫ్యామిలీ గురించి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు ఇండస్ట్రీలో తీవ్ర స్థాయిలో కలకలం రేపుతున్నాయి.ఇదిలా ఉంటే.. తాజాగా తన సోషల్ మీడియా ఖాతాలో నటుడు అక్కినేని నాగార్జున ఆసక్తికర పోస్ట్ చేశారు. "నేను ఎప్పుడూ బలమైన వ్యక్తిని అని అనుకుంటున్నాను. నా కుటుంబాన్ని రక్షించే విషయంలో నేను సింహాన్ని. అదృష్టవశాత్తూ తెలుగు పరిశ్రమ మొత్తం మాకు అండగా నిలబడింది. ఇదంతా మా నాన్నగారి ఆశీర్వాదంగా భావిస్తున్నాను. అందరి ఆదరాభిమానాలు, ఆశీర్వాదాలు మాకు ఎల్లప్పుడూ ఉంటాయని అనుకుంటున్నాను" అంటూ పోస్ట్ చేశారు. ప్రస్తుతం నాగార్జున చేసిన పోస్ట్ నెట్టింట వైరల్ గా మారింది.కొండ సురేఖ వ్యాఖ్యలు..బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పై విమర్శలు గుప్పించిన సమయంలో అక్కినేని నాగచైతన్య, హీరోయిన్ సమంత విడాకుల గురించి సంచలన కామెంట్స్ చేసింది తెలంగాణ మంత్రి కొండా సురేఖ. చైతూ, సామ్ విడిపోవడానికి కారణం కేటీఆర్ అని వ్యాఖ్యలు చేయడంతో సినీ ఇండస్ట్రీ ఆగ్రహం వ్యక్తం చేసింది. కొండ సురేఖ వ్యాఖ్యలు అటు అక్కినేని కుటుంబంతోపాటు, మెగాస్టార్ చిరంజీవి, ఎన్టీఆర్, ప్రభాస్, రామ్ చరణ్, మహేష్ బాబు, రాజమౌళి, నాగచైతన్య, అఖిల్, సాయి ధరమ్ తేజ్, మంచు మనోజ్ ఖండించారు. రాజకీయాల కోసం సినీతారల పేర్లు వాడుకోవద్దని హెచ్చరించారు.

# ప్రధాని మోదీకి ధన్యవాదాలు తెలిపిన నటుడు రజినీకాంత్..!



ఇటీవల అనారోగ్యానికి గురైన తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్ ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయిన తర్వాత తొలిసారి అందరికీ కృతజ్ఞతలు తెలుపుతూ సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టారు.తన ఆరోగ్యం గురించి ప్రార్థించిన శ్రేయోభిలాషులకు, అభిమానులకు ఆయన ధన్యవాదాలు చెప్పారు. ప్రధాని నరేంద్ర మోదీకి కూడా కృతజ్ఞతలు తెలియజేశారు.'నా ఆరోగ్యంపట్ల ప్రత్యేక శ్రద్ధ చూపించి, ఫోన్ చేసి పరామర్శించిన ప్రధాని నరేంద్రమోదీకి నా హృదయపూర్వక ధన్యవాదాలు' అని రజినీకాంత్ పేర్కొన్నారు. తాను త్వరితగతిన కోలుకోవాలని ప్రార్థించిన తమిళనాడు సీఎం స్టాలిన్‌కు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, బాలీవుడ్ స్టార్ అమితాబ్ బచ్చన్‌కు కృతజ్ఞతలు చెప్పారు.రజనీకాంత్ సెప్టెంబర్ 30న చెన్నైలోని ప్రముఖ ఆస్పత్రిలో చేరారు. గుండె నుంచి బయటకు వచ్చే ప్రధాన రక్తనాళంలో వాపు ఏర్పడినట్లు వైద్యులు గుర్తించారు. ట్రాన్స్‌కాథెటర్ పద్ధతి ద్వారా చికిత్స అందించి స్టెంట్ అమర్చారు. ఆరోగ్యం నిలకడగా ఉండటంతో ఆయన్ని గురువారం రాత్రి డిశ్చార్జ్ చేశారు. కొన్ని వారాల పాటు విశ్రాంతి అవసరమని చెప్పారు.ఇదిలావుంటే రజనీకాంత్ నటించిన 'వేట్టయాన్' అక్టోబర్ 10న విడుదల కానుంది. టీజే జ్ఞానవేల్ దీనికి దర్శకత్వం వహించారు. భారీ తారాగణంతో తెరకెక్కిన ఈ సినిమాపై ప్రేక్షకుల్లో ఎన్నో అంచనాలు ఉన్నాయి. అదేవిధంగా ఆయన 'కూలీ' కోసం వర్క్ చేస్తున్నారు. లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో ఈ సినిమా రూపుదిద్దుకుంటోంది. విశ్రాంతి అనంతరం రజనీకాంత్ ఈ సినిమా చిత్రీకరణలో పాల్గొనే అవకాశం ఉంది.

## ఇండియన్ 3 థియేటర్లలో విడుదల కావడం లేదా ??



సీక్వెల్స్, త్రీక్వెల్స్ మీద పాజిటివ్ బజ్ క్రియేట్ కావాలంటే ప్రీవియస్ లను చూసి ప్రేక్షకులు పండగ చేసుకుని ఉండాలి. అలా కాకుండా, అంతంతమాత్రంగా లు ఆడినా...సోసో క్రేజ్‌ని సొంతం చేసుకోవచ్చు. అసలుకే మోసం వచ్చిన కు మళ్లీ మరో కొనసాగింపు రెడీ అవుతోందంటే ఏమనుకోవాలి...సోసో క్రేజ్‌ని సొంతం చేసుకోవచ్చు. అసలుకే మోసం వచ్చిన కు మళ్లీ మరో కొనసాగింపు రెడీ అవుతోందంటే ఏమనుకోవాలి...ఇండియన్ 3 థియేట్రికల్ రిలీజ్ కాకపోవచ్చనే మాట స్పీడ్‌గా వైరల్ అవుతోంది. ఇంతకీ మేకర్స్ మనసులో ఏం ఉందో తెలుసుకోవాలంటే లెట్స్ వెయిట్ అండ్ సీ...ఇండియన్ త్రీక్వెల్‌లో కమల్ యంగ్‌గా కనిపిస్తారా?

## క్లాసిక్ బ్లాక్ గౌనులో శ్రీలీల

గ్లామర్ నటి శ్రీలీల ఆమె బోల్డ్ ఫ్యాషన్ ఎంపికలకు ప్రసిద్ధి చెందింది. కలకాలం మరియు సొగసైన రూపంతో అభిమానులను ఆశ్చర్యపరిచింది. శైలిలో తన బహుముఖ ప్రజ్ఞను ప్రదర్శిస్తుంది.ఆమె పాతకాలపు గ్లామర్‌ను వెదజల్లుతూ సున్నితమైన తెల్లని గులాబీ పువ్వులతో అలంకరించబడిన అద్భుతమైన నలుపు స్లీవ్‌లెస్ గౌనులో కనిపించింది. గౌను యొక్క క్లిష్టమైన వివరాలు మరియు క్లాసిక్ సిల్హౌట్ శ్రీలీల అందాన్ని సంపూర్ణంగా పూర్తి చేసింది. అయితే ఆమె ఎత్తైన బన్ను మరియు సొగసైన తెల్లని పెర్ల్ చెవిపోగులు అధునాతనతను జోడించాయి. శ్రీలీల ఫ్యాషన్ రూపాంతరం గణనీయమైన దృష్టిని ఆకర్షించింది.అభిమానులు ఆమె సొగసైన మరియు క్లాసిక్ ఎంపికను ప్రశంసించారు. ఆమె తన నటనతో ప్రేక్షకులను ఆకర్షిస్తూనే ఉంది, ఆమె రాబోయే ప్రాజెక్ట్‌లలో కూడా బిజీగా ఉంది. ప్రస్తుతం నితిన్‌తో కలిసి భారీ అంచనాల చిత్రం "రాబిన్ హుడ్" చిత్రీకరణలో శ్రీలీల తన నటనా ప్రతిభతో అభిమానులను ఆకట్టుకోవడానికి సిద్ధంగా ఉంది. ఆమె ఇటీవలి ఫ్యాషన్ ప్రకటన ఆమె భవిష్యత్ రెడ్ కార్పెట్ ప్రదర్శనల కోసం అంచనాలను పెంచింది.

## న్యూజిలాండ్‌తో పోరు - తొలి మ్యాచ్‌లో భారత్ ఓటమి



మహిళల టీ20 ప్రపంచకప్‌లో భాగంగా న్యూజిలాండ్‌తో జరిగిన తొలి మ్యాచ్‌లో భారత్ ఓటమిపాలైంది. మహిళల టీ20 ప్రపంచకప్‌లో భాగంగా న్యూజిలాండ్‌తో జరిగిన తొలి మ్యాచ్‌లో భారత్ ఓటమిపాలైంది. ప్రత్యర్థి జట్టు నిర్దేశించిన 161 పరుగుల లక్ష్యాన్ని ఛేదించడంలో బ్యాటర్లు విఫలం కావడంతో 102 పరుగులకే ఆలౌటైంది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ 15, జెమీమా 13, దీప్తి 13, స్మృతి 12, రిచా 12 పరుగులు చేశారు. మిగతా బ్యాటర్లు సింగిల్ డిజిట్‌కే ఔటయ్యారు. న్యూజిలాండ్ బౌలర్లలో రోస్‌మేరీ 4, లియా 3, ఇడెన్ 2, అమేలియా ఒక వికెట్ తీశారు.

# 15 పరుగులు, సున్నా వికెట్లు - అయినా ఆ మ్యాచ్ హీరోగా నిలిచిన సచిన్!




ఓ మ్యాచ్‌లో పరుగులు చేయకపోయినా, వికెట్లు తీయకపోయినా మ్యాచ్ హీరోగా నిలిచిన సచిన్ తెందుల్కర్. ప్రపంచ క్రికెట్‌లో భారత్‌కు సచిన్ తెందూల్కర్ ఎన్నో చిరస్మరణీయ విజయాలను అందించాడు. టీమ్ ఇండియా తరఫున వేల పరుగులు, ఎన్నో వికెట్లు తీశాడు. 24 ఏళ్ల సుదీర్ఘ కెరీర్‌లో చాలా సందర్భాల్లో బ్యాటుతో, బంతితో ప్రత్యర్థులను వణికించాడు. అలానే కొన్ని మ్యాచుల్లో విఫలమ్యాడు కూడా. అయితే ఒక మ్యాచ్‌లో అటు బ్యాట్‌తో ఇటు బంతితో విఫలమైనప్పటికీ ఆ మ్యాచ్‌లో హీరోగా నిలిచాడు. అదెలా అంటే?ఈ మ్యాచ్‌లో ఏం జరిగిందంటే? – ఈ మ్యాచ్ వివరాలు తెలుసుకునేందుకు మూడు దశాబ్దాల వెనక్కి వెళ్లాలి. 1993లో కోల్‌కతా, ఈడెన్ గార్డెన్స్ వేదికగా భారత్ – దక్షిణాఫ్రికా మధ్య జరిగిన హీరో కప్ సెమీఫైనల్లో ఈ సంఘటన చోటు చేసుకొంది. టీమ్‌ఇండియా మొదట 195 పరుగులు చేసింది. ఇందులో మహ్మద్ అజారుద్దీన్ 90 పరుగులతో అదరగొట్టాడు. కానీ సచిన్ మాత్రం కేవలం 15 పరుగులకే ఔట్ అయ్యాడు.అనంతరం లక్ష్య ఛేదనలో 49 ఓవర్లకు దక్షిణాఫ్రికా స్కోరు 190/8. చేతిలో ఇంకా రెండు వికెట్లు ఉండగా, విజయానికి ఆరు బంతుల్లో ఆరు పరుగులు చేయాల్సి ఉంది. అప్పుడు అజారుద్దీన్ ఊహించని విధంగా సచిన్‌కు బౌలింగ్ ఇచ్చాడు. అప్పటికి యంగ్ ప్లేయర్ సచిన్ మ్యాచ్ మొత్తంలో ఒక్క ఓవర్ కూడా వేయలేదు. అలాంటి సచిన్‌పై పెద్ద బాధ్యత పడింది.అతడి బౌలింగ్‌లో ఓ రన్ అవుట్ నమోదు అయింది. దీంతో దక్షిణాఫ్రికా చేతిలో ఒక వికెట్ మాత్రమే మిగిలి ఉంది. విజయానికి ఒక బంతికి నాలుగు పరుగులు చేయాలి. ఆ సమయంలో సచిన్ చివరి బంతి టైట్ లైన్ అండ్ లెంగ్త్‌తో బౌలింగ్ చేశాడు. అప్పుడు దక్షిణాఫ్రికాకు కేవలం ఒక్క పరుగు మాత్రమే వచ్చింది. అలా దక్షిణాఫ్రికా 193/9కి పరిమితం అయింది. భారత్ రెండు పరుగుల తేడాతో విజయం సాధించింది.సచిన్ ప్రదర్శనతోనే విజయం – ఈ ప్రదర్శనతో ఆ మ్యాచ్‌లో సచిన్ హీరోగా నిలిచాడు. అతడు ఎక్కువ పరుగులు చేయకపోయినా, వికెట్ తీయకపోయినా బౌలింగ్ టైట్‌గా వేసి హీరోగా నిలిచాడు. తద్వారా భారత జట్టు ఫైనల్‌కు చేరింది. ఈ మ్యాచ్ తర్వాత సచిన్ రెండు సార్లు ఐదు వికెట్ల ప్రదర్శన కూడా చేశాడు.

# గ్వాలియర్‌లో 14ఏళ్ల తర్వాత ఇంటర్నేషనల్ మ్యాచ్ సచిన్ డబుల్ సెంచరీ చేసింది అక్కడే!



మధ్యప్రదేశ్ లోని గ్వాలియర్ నగరంలో 14 ఏళ్ల తర్వాత అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్ జరగనుంది. అక్టోబరు 6న భారత్–బంగ్లా జట్లు గ్వాలియర్ వేదికగా తొలి టీ20లో తలపడనున్నాయి.ఇటీవలే బంగ్లాదేశ్‌తో జరిగిన రెండు టెస్టుల సిరీస్‌ను టీమ్‌ఇండియా వైట్ వాష్ చేసింది. ఈ నేపథ్యంలో త్వరలో జరగనున్న టీ20 సిరీస్‌పై కూడా కన్నేసింది. అక్టోబరు 6న గ్వాలియర్ నగరంలో కొత్తగా నిర్మించిన 'శ్రీమంత్ మాధవరావు సింధియా క్రికెట్ స్టేడియం'లో భారత్, బంగ్లాదేశ్ జట్లు తొలి టీ20లో తలపడనున్నాయి. అయితే 14 ఏళ్ల తర్వాత గ్వాలియర్ నగరంలో ఇంటర్నేషల్ క్రికెట్ మ్యాచ్ జరగనుండటం గమనార్హం.సచిన్ డబుల్ సెంచరీ తర్వాత నో మ్యాచ్ గ్వాలియర్ నగరంలో 14 ఏళ్ల తర్వాత అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్ జరగబోతోంది. ఇక్కడ చివరి మ్యాచ్ 2010లో జరిగింది. రూప్ సింగ్ స్టేడియం వేదికగా జరిగిన ఆ మ్యాచ్‌లో భారత్–దక్షిణాఫ్రికా జట్లు తలపడ్డాయి. ఈ మ్యాచ్‌లో టీమ్ ఇండియా దిగ్గజం సచిన్ టెండూల్కర్ వన్డే క్రికెట్‌లో మొదటి డబుల్ సెంచరీని చేశాడు. దీంతో టీమ్‌ఇండియా 153 పరుగుల తేడాతో విజయం సాధించింది. అయితే గ్వాలియర్ లో సుదీర్ఘకాలం తర్వాత అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్ జరగనుండటం వల్ల స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.షెడ్యూల్ మార్పుతో గ్వాలియర్‌కు అవకాశం అయితే తొలుత భారత్– బంగ్లాదేశ్ మధ్య తొలి టీ20ని హిమాచల్ ప్రదేశ్ లోని ధర్మశాలలో నిర్వహించాలని బీసీసీఐ భావించింది. అక్కడ స్టేడియం పునరుద్ధరణ పనులు జరుగుతుండడం వల్ల వేదికను ఇటీవలే మార్చింది. గ్వాలియర్ లోని 'శ్రీమంత్ మాధవరావు సింధియా క్రికెట్ స్టేడియం'లో నిర్వహించేందుకు సిద్ధమైంది. దీంతో 14 ఏళ్ల తర్వాత గ్వాలియర్ నగరంలో అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్ జరగనుంది.గ్వాలియర్ లో 10 వన్డేలు ఆడిన భారత్ గ్వాలియర్ నగరంలోని రూప్ సింగ్ స్టేడియంలో మొదటి అంతర్జాతీయ మ్యాచ్ 1988లో జరిగింది. ఆ మ్యాచ్ లో భారత్ పై వెస్టిండీస్ 73 పరుగుల తేడాతో విజయం సాధించింది. గ్వాలియర్ లో ఇప్పటివరకు టీమ్ ఇండియా మొత్తం 10 వన్డేలు ఆడగా, అందులో 8 గెలిచింది. రెండింట్లో ఓటమిపాలైంది.

PMR Publication,Thurkayamjal 4-136/12, 9100900918

Jai DURGA BHAVANI
BUILDING PLANNERS
T.Satyanarayana
Cell: 93953 85229
86887 83383
HMDA, DTCP,
Layout Approvals,
Building Permissions,
Construction Drawing,
Estimations,
Valuations
RERA Approvals,
All GHMC Works,
We Undertake Building,
Constructions & Development,
Bank Loans
Building Elevation Designs
# K P Towers,Above Telangana State Co-Operative Apex bank,
Brahmanapally road,Ragannaguda,Turkayamjal, Rangareddy-Dist-501510.

తెలంగాణ శాసనసభ
తెలుగు దినపత్రిక
జిల్లా అనుబంధం
|| శనివారం 05 అక్టోబర్ - 2024 || పేజీలు : 4

# స్నేహితుడే హంతకుడు

## మియాపూర్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని హత్య



**మియాపూర్ హైదరాబాద్ / శాసనసభ న్యూస్ ప్రతినిధి :** మియాపూర్‌లో దారుణ హత్యకు గురైన సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని హత్యకేసును పోలీసులు ఛేదించారు. స్పందనను హత్య చేసింది ఆమె స్నేహితుడేనని పోలీసుల దర్యాప్తులో తేలింది. దీంతో శుక్రవారం నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. నాలుగు రోజుల క్రితం మియాపూర్‌లో ఓ వివాహితను పదునైన ఆయుధంతో ఆమె ఇంట్లోనే హత్య చేసిన ఘటన సంచలనం సృష్టించింది. దీప్తిశ్రీనగర్ సీబీఆర్ ఎస్టేట్ 3ఏ బ్లాక్‌లో ఉండే ప్రైవేట్ పాఠశాల ఉపాధ్యాయురాలు నమ్రత కుమార్తె బండి స్పందన (29) సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. ఇంటర్ చదువుతున్న సమయంలోనే అదే కాలనీకి చెందిన వినయ్‌కుమార్‌ను ప్రేమించింది. 2022 ఆగస్టులో పెద్దల సమక్షంలో వివాహం జరిగింది. భర్త ఓ ప్రైవేట్ కంపెనీలో అకౌంటెంట్. 2023లో భర్త తనను వేధిస్తున్నాడంటూ మియాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అతనిపై కేసు నమోదైంది. విడాకుల కేసు కోర్టులో ఉంది. ఈ క్రమంలో తల్లి వద్దే ఉంటోంది. సోమవారం తల్లి తాను పనిచేస్తున్న పాఠశాలలో విధులకు వెళ్లగా స్పందన ఇంట్లో ఉంది. సాయంత్రం పాఠశాల నుంచి తిరిగి వచ్చిన తల్లి కాలింగ్ బెల్ నొక్కినా, కుమార్తె సెల్‌ఫోన్‌కు కాల్ చేసినా స్పందించకపోవడంతో స్థానికుల సాయంతో తలుపు బద్దలు కొట్టి చూడగా అప్పటికే హత్యకు గురై ఉంది. పదునైన ఆయుధంతో విచక్షణారహితంగా పొడిచినట్లు కనిపిస్తున్నా.. అక్కడ ఎటువంటి ఆయుధం లభించలేదు. సీసీ ఫుటేజీ, సెల్‌టవర్ లోకేషన్ ఆధారంగా దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. స్పందనను హత్య చేసింది మనోజ్ అలియాస్ బాలుగా గుర్తించారు. మృతురాలు స్పందన, మనోజ్ ఇద్దరూ ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నారు. ఎప్పటి నుంచో క్లాస్‌మేట్ కావడంతో మనోజ్ ఆమెపై ఇష్టం పెంచుకున్నాడు. మధ్యలో ఆమెకు పెళ్లి జరగడంతో మనస్థాపానికి గురయ్యాడు. భర్తతో వివాదాలు రావడంతో స్పందన ఓ ఇల్లు అద్దెకు తీసుకుని తల్లితో కలిసి ఉంటోంది. మనోజ్ ప్రేమ మళ్లీ చిగురించింది. తనను ప్రేమించాలంటూ ఆమెపై ఒత్తిడి చేశాడు. స్పందన తన ప్రేమను తిరస్కరించడం, సాటి ఉద్యోగులతో స్నేహంగా ఉండటాన్ని చూసి తట్టుకోలేకపోయాడు. పలు మార్లు ఇద్దరి మధ్య గొడవ జరిగింది. పగ పెంచుకున్న మనోజ్ .. ఆమె నివసిస్తున్న సీబీఆర్ ఎస్టేట్‌లోని అపార్ట్‌మెంట్‌లోకి చొరబడి తీవ్రంగా దాడి చేశాడు. బండరాయితో మోదీ, స్క్రూడ్రైవర్‌తో విచక్షణారహితంగా పొడిచాడు. దీంతో స్పందన అక్కడికక్కడే మృతి చెందింది. మనోజ్‌పై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్టు మియాపూర్ పోలీసులు తెలిపారు.

# రూ.15లక్షల విలువైన క్రాకర్స్ సీజ్

## టపాసుల గోదాముపై టాస్క్‌ఫోర్స్ దాడి..

**హైదరాబాద్ / శాసనసభ న్యూస్ ప్రతినిధి :** బేగంబజార్‌లోని ఓ టపాసుల గోదాముపై మధ్య మండలం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించారు. దీపావళి పండుగ కోసం బేగంబజార్‌కు చెందిన ఓ వ్యాపారి అక్రమంగా తన గోదాములో క్రాకర్స్ నిల్వ చేశాడు. విశ్వసనీయ సమాచారంతో సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించి రూ. 15లక్షల విలువైన క్రాకర్స్ సీజ్ చేశారు. బేగంబజార్ ప్రాంతానికి చెందిన శ్యామ్ యాదవ్ అనే వ్యాపారి ఏటా దీపావళికి ముందు.. ఇతర ప్రాంతాల నుంచి క్రకర్స్ తీసుకువచ్చి తన గోదాములలో నిల్వ చేసి విక్రయించేవాడు. సదరు వ్యాపారి నిల్వచేసిన క్రాకర్స్‌కు ఎలాంటి అనుమతులు లేవని పోలీసులు తేల్చారు. తదుపరి విచారణ నిమిత్తం..



స్వాధీనం చేసుకున్న టపాసులు, ఇద్దరు వ్యక్తులను టాస్క్‌ఫోర్స్ పోలీసులు బేగంబజార్ పోలీసులకు అప్పగించారు.

# ఎన్ని ఆటంకాలు

## ఎదురైనా మూసీ ప్రక్షాళన పూర్తి చేస్తాం

**హైదరాబాద్ / శాసనసభ న్యూస్ ప్రతినిధి :** ఎన్ని ఆటంకాలు ఎదురైనా మూసీ ప్రక్షాళన పూర్తి చేస్తామని రహదారులు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని నోవాటెల్‌లో అసోచామ్ ఆధ్వర్యంలో అర్బన్ ఇన్‌ఫ్రాస్టక్చర్ సమిట్ జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ.. మూసీని సుందరీకరించి ప్రపంచస్థాయి నగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దుతామన్నారు. మూసీకంటే ప్రమాదకరమైన సబర్మతిని మంచినీటి సరస్సుగా మార్చారని గుర్తు చేశారు. హైదరాబాద్ మహానగర జనాభా కోటిన్నర దాటిందని, నగరంలో నాలుగు మేయర్ స్థానాలు ఏర్పాటు చేసే అంశం పరిశీలనలో ఉందని తెలిపారు. అమెరికా తర్వాత అధిక



బహుళజాతి కంపెనీలు హైదరాబాద్‌లోనే ఉన్నాయన్నారు. రీజినల్ రింగ్‌రోడ్డుతో హైదరాబాద్ రూపురేఖలు మారిపోతాయని, రెండు నెలల్లో టెండర్లు పిలుస్తామని మంత్రి తెలిపారు.

### అభివృద్ధి చేయండి.. కానీ హైదరాబాద్ ప్రజలను

# కన్నీరు పెట్టించొద్దు : ఎమ్మెల్యే మాధవరం

**హైదరాబాద్ / శాసనసభ న్యూస్ ప్రతినిధి :** హైడ్రా, మూసీ కూల్చివేతల విషయంలో అఖిలపక్ష సమావేశం పెడతామన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటనను స్వాగతిస్తున్నామని భారాస ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తెలిపారు. అఖిలపక్షం మూడు నెలల ముందే ఈ సమావేశాన్ని పెట్టి ఉంటే కూకట్‌పల్లిలో బుచ్చమ్మ అనే మహిళ మృతి చెందేది కాదన్నారు. అఖిలపక్ష సమావేశం పెట్టాలని తాము గతంలో సూచించామన్న ఆయన... హైదరాబాద్‌లో ఎన్ని చెరువులు ఉండేవి, ఇప్పుడు ఎన్ని ఉన్నాయో ప్రభుత్వం, సీఎం చెప్పాలని డిమాండ్ చేశారు. అధికారులు ముఖ్యమంత్రిని తప్పుదోవ పట్టిస్తున్నారని, ఆయన పూర్తి అవగాహనతో మాట్లాడాలని మాధవరం సూచించారు. గతంలో చెరువులకు కేటీఆర్ ఆదేశాల మేరకు కంచె వేశామన్నారు. నల్లచెరువు వద్ద పట్టాలు ఉన్న రైతులు హైకోర్టుకు వెళ్లడంతో కట్ట తీయాల్సివచ్చిందని చెప్పారు. నల్ల చెరువు, కూకట్‌పల్లిలో భారాస నేతల ప్రమేయం



ఉంటే సీఎం చర్యలు తీసుకోవచ్చన్నారు. నల్ల చెరువు, ఖాజాకుంట, మైసమ్మ చెరువు అక్రమాల్లో ఎవరు ఉన్నారో సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలన్నారు. 60, 70 ఏళ్లుగా ఉంటున్న వారి నుంచి పన్నులు వసూలుచేసి ఇప్పుడు కబ్జాదారులు అనడం తగదన్నారు. కేసీఆర్ ప్రభుత్వం నిర్మించిన ఇళ్లు, చేసిన అభివృద్ధి కార్యక్రమాలనే కాంగ్రెస్ చెప్పుకుంటోందని... ఎంపీగా ఉన్నప్పుడు రేవంత్ రెడ్డి ఐదేళ్లలో కూకట్‌పల్లి నియోజకవర్గానికి రూ.కోటి మాత్రమే ఇచ్చారని మాధవరం కృష్ణారావు ఎద్దేవా చేశారు.

# 'బీజేపీ మెప్పు కోసం మంద కృష్ణ తాపత్రయం'



**హైదరాబాద్ / శాసనసభ న్యూస్ ప్రతినిధి :** బీజేపీ మెప్పు కోసమే మంద కృష్ణ తాపత్రయం పడుతున్నాడని కాంగ్రెస్ నాయకుడు గజ్జెల కాంతం మండిపడ్డారు. శుక్రవారం ఆయన గాంధీభవన్ లో మీడియాతో మాట్లాడుతూ..మంద కృష్ణ మాదిగ రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని విమర్శించడం సరికాదన్నారు. వర్గీకరణ కోసం రేవంత్ రెడ్డి ఇప్పటికే ఓ కమిటీ వేశారని, త్వరలో మరో జ్యూడీషియల్ కమిటీ వేసేందుకు కూడా ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదన్నారు.

మిగతా 4లో

# ఆయిల్ పామ్ సాగుపై అవగాహన సదస్సు
## దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్




**దేవరకొండ అక్టోబర్ 04 శాసనసభ న్యూస్ ప్రతినిధి :** దేవరకొండలి మండలంలోని కొండభీమన పల్లి గ్రామ పరిధిలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన నల్గొండ జిల్లా ఆయిల్ పామ్ రైతుల అవగాహన సదస్సు ఉద్యాన శాఖ వారి సహకారంతో పతాంజలి ఫుడ్స్ లిమిటెడ్ నిర్వహించిన కార్యక్రమంలో దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ పాల్గొన్నారు,ఈ సందర్భంగా ఎమ్మెల్యే.. మాట్లాడుతూ ఆయిల్ పామ్ సాగుతో తక్కువ పెట్టుబడితో రైతులు ఎక్కువ లాభాలు ఆర్జించేందుకు అవకాశముందని అన్నారు.రైతులు సంప్రదాయ పంటలకు బదులుగా అధిక లాభాలు అందించే ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని సూచించారు. ఆయిల్ పామ్ మొక్కలు నాటిన తరువాత నాలుగో సంవత్సరం నుంచి దిగుబడులు ప్రారంభం అవుతాయని, 25 సంవత్సరాల వరకు ఈ మొక్క దిగుబడి ఇస్తూ రైతులకు ఆదాయాన్ని ఆర్జించి పెడుతుందన్నారు. ఆయిల్ పామ్ వల్ల కలిగే లాభాలు గురించి రైతులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పిస్తూ, ఆసక్తి అనుకూల పరిస్థితులు కలిగి ఉన్న రైతులు ఆయిల్ పామ్ సాగు చేసేలా చూడాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వం కూడా ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహిస్తూ పెద్ద ఎత్తున రాయితీలను ఇస్తోందన్నారు. ఈ పంట దిగుబడిని మార్కెటింగ్ చేయడం కూడా ఎంతో సులభమని, ముందస్తుగానే ఒప్పందం కుదుర్చుకున్న కంపెనీలు వచ్చి నిర్ణీత మద్దతు ధరకు కొనుగోలు చేసి తీసుకెళ్తాయన్నారు. ఆయిల్ పామ్ సాగుపై రైతులు దృష్టిసారించేలా చూడాలని ఉద్యాన, జిల్లా వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు. త్వరలో రైతు రుణమాఫీ మరియు రైతు భరోసా నేరుగా రైతుల ఖాతాలో జమ అవుతుంది అని అన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహా,మాజి ఎంపీపీ జాని యాదవ్,మండల పార్టీ అధ్యక్షులు శ్రీధర్ రెడ్డి, సీనియర్ నాయకులు దేవేందర్ నాయక్ ప్రజా ప్రతినిధులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, యువజన విభాగ నాయకులు రైతులు, హార్టికల్చర్ అధికారులు DHSO సాయి బాబా,APD శ్రీనివాసులు,DGM యాదగిరి,సుబ్బ రెడ్డి, కిరణ్,రాజా గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రోటోకాల్ పాటించని
## మున్సిపల్ కమిషనర్



**చండూరు అక్టోబర్ 4(శాసనసభ న్యూస్) :** చండూరు మున్సిపాలిటీ నాలుగో వార్డ్ కౌన్సిలర్ అన్నపర్తి శేఖర్ శుక్రవారం రోజు జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వే పైలెట్ కార్యక్రమంలో భాగంగా చండూరు మున్సిపాలిటీకి చెందిన మూడో వార్డు ఎంపిక జరిగినది. అందులో భాగంగా గురువారం రోజు చండూరు రెవిన్యూ డివిజన్ అధికారి(ఆర్డీవో) అధ్యక్షతన మూడవ వార్డులో ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి చండూరు మున్సిపల్ కమిషనర్ మున్సిపల్ చైర్ పర్సన్ కానీ ఏ ఒక్క కౌన్సిలర్ను కానీ ఆహ్వానించకుండా సమావేశం నిర్వహించారు. అంతేకాకుండా ఈ యొక్క ప్రభుత్వ ప్రారంభ కార్యక్రమానికి మూడవ వార్డు నివాసితులైన ఒక రాజకీయ పార్టీ నాయకులను అతిథులుగా పిలిచి వేదికపై కూర్చోబెట్టినారు. ప్రజా ప్రతినిధులను ఆహ్వానించకుండా ప్రోటోకాల్ కు విరుద్ధంగా రాజకీయ పార్టీ నాయకులను వేదిక పైకి ఆహ్వానించిన చండూర్ మున్సిపల్ కమిషనర్ పై తగు చర్య తీసుకోవాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. వెంటనే కలెక్టర్ స్పందించకుంటే లోకాయుక్త కోర్టులో ఫిర్యాదు చేస్తానని ఆయన అన్నారు.

# ఇక నుంచి గూగుల్ పే ద్వారా
## రూ.5 లక్షల వ్యక్తిగత ఋణం




**హైదరాబాద్, శాసన సభ :** ఇక నుంచి గూగుల్ పే ద్వారా రూ.5 లక్షల వరకు వ్యక్తిగత రుణం తీసుకోవచ్చని గూగుల్ తెలిపింది. అలాగే తమ ప్లాట్ఫామ్ ద్వారా రూ.50 లక్షల వరకు గోల్డ్ లోన్ తీసుకోవచ్చని గూగుల్ పేర్కొంది. ఇందుకోసం ముత్తూట్ ఫైనాన్స్ తో జత కట్టినట్లు తెలిపింది. కాగా,గూగుల్ మ్యాప్స్ లోని 170 మిలియన్ల ఫేక్ రివ్యూలనుఏఐ సాయంతో తొలగించినట్లు గూగుల్ తెలిపింది.

# కె.జి.వి.వి. పాఠశాలకు మోబీస్ ఇండియా ఫౌండేషన్ డొనేటెడ్ ముప్పై డెస్క్ టాప్స్









**చండూర్ అక్టోబర్ 4 శాసనసభ న్యూస్) :** ఘట్టుపాల్ మండలం లో కె.జి.వి.వి. పాఠశాలో మోబీస్ ఇండియా ఫౌండేషన్ సీనియర్ జనరల్ మేనేజర్ మిస్టర్ హేమాద్రి లోగ్ నాదం మాట్లాడుతూ కె.జి.వి.వి. పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు వివిధ పల్లెటూర్ల నుంచి వస్తున్నారని తెలుసుకొని వారికి టెక్నాలజీ విద్యా అందించాలని ముప్పై డెస్క్ టాప్స్ అందించడం జరిగిందని వివరించారు. పాఠశాల యాజమాన్యం వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మోబీస్ ఇండియా ఫౌండేషన్ సీనియర్ జనరల్ మేనేజర్ మిస్టర్ హేమాద్రి లోగ్ నాదం, డిప్యూటీ జనరల్ మేనేజర్ క్రిష్ణ కుమార్, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ వేణు మాధవ్, రవిందర్, శ్రీనివాస్, వంశీ, పాఠశాల కరెస్పాండెన్ మ్యాగ్డాలిన్.రేవతి, ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ లావణ్య, ప్రాధానోపాద్యాయులు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్ని విజయవంతం చేశారు.

# కల్వర్టును ఢీకొన్న కారు.. వ్యక్తి మృతి



**నల్గొండ / శాసన సభ :** కారు అదుపుతప్పి కల్వర్టును ఢీకొట్టడంతో వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన జాజిరెడ్డిగూడెం మండలం అడివెంల వద్ద శుక్రవారం సాయంత్రం జరిగింది.వివరాల్లోకి వెళ్తే.. నూతనకల్ మండలం పెద్ద నెమిల గ్రామానికి చెందిన రేసు రాములు గౌడ్ (49) సూర్యాపేటలో స్థిరపడ్డాడు. తుంగతుర్తిలో శుభకార్యానికి భార్య అంజమ్మ, మనువరాలితో కలిసి శుక్రవారం హాజరై సూర్యాపేటకు సాయంత్రం తిరిగి వెళ్ళుతున్నాడు. ఈ క్రమంలో అడివెంల గ్రామం వద్ద కారు అదుపుతప్పి, కల్వర్టును ఢీకొట్టి అక్కడికక్కడే మృతి చెందాడు.భార్యకు గాయాలు కావడంతో సూర్యాపేటకు మెరుగైన చికిత్స కోసం తరలించారు. కాగా, మృతునికి ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. ఈ సంఘటనతో పెద్ద నెమిల, సూర్యాపేటలో విషాద ఛాయలు అలుముకున్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని సూర్యాపేటకు తరలించారు.

# రూ.2 లక్షల రుణమాఫీ ఏమాయే?

**- రైతులు, ప్రజలంటే సీఎంకు పట్టింపే లేదు - రాష్ట్ర మాజీ మంత్రి తన్నీరు హరీశ్రావు**

**- రైతులతో కలిసి తొర్రూర్ పట్టణ కేంద్రంలో ధర్నా**

**- ఎన్నికల హామీల్లో భాగంగా రూ.2లక్షల రుణమాఫీ ఏమాయే...**

శాసనసభ ప్రతినిధి / మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ : రుణమాఫీ కాని రైతుల పరిస్థితిపై ఇప్పటివరకు ప్రభుత్వం ఎలాంటి స్పష్టతా ఇవ్వలేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్రావు ఆరోపించారు. కుంటి సాకులతో రైతుల రుణమాఫీ ఆపారని అన్నారు. రైతులు, మహిళలు, వృద్ధులు, ఉద్యోగులు, నిరుద్యోగులు నేడు రేవంత్ రెడ్డిని మోసగాడని అంటు న్నారని తెలిపారు. దేశంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న ఒక్కో రాష్ట్రంలో ఒక్కో రకమైన మోసపూరితమైన హామీలను ఇస్తున్నారని చెప్పారు. కౌలు రైతులకు రూ.15,000 రైతు భరోసా, వ్యవసాయ కూలీలకు రూ.12,000 హామీ ఏమైందని ప్రశ్నించారు. వీటన్నింటిపై రాహుల్ గాంధీ.. కనీసం అడగడం లేదా అని ప్రశ్నించారు. నేడు రాష్ట్రంలో రౌడీ రాజ్యం నడుస్తున్నదని, హైడ్రా పేరుతో హైదరాబాద్లో పేదల ఇండ్లను కూలగొడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వారి ఇండ్లను కూలిస్తే తాము చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. రూ.2లక్షల రుణమాఫీ, దసరా లోపు రైతులకు రైతుబంధు డబ్బులు ఎకరానికి రూ.7,500 బ్యాంక్ ఖాతాలో జమచేయాలని కోరారు. ఇప్పటికే మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం దరావత్ తండాలో ఒక రైతు, దుబ్బాక మండలం చిట్టాపూర్ గ్రామంలో సురేందర్ రెడ్డి అనే రైతు రుణమాఫీ కాక చనిపోయినట్టు చెప్పారు. రైతులకు ఇచ్చిన మాట ప్రకారం అన్ని హామీలు అమలు చేయాలని కోరుతూ ఢిల్లీకి వెళ్లి రాహుల్గాంధీ ఇంటి ముందు ధర్నా చేస్తామని తెలిపారు. వడ్ల కొనుగోలు కేంద్రాల వద్దకు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు వస్తే రైతులు, ప్రజలు నిలదీయాలని పిలుపునిచ్చారు. బతుకమ్మ పండుగకు చీరల పంపిణీ,



కేసీఆర్ కిట్లు బంద్ అయ్యాయని గుర్తు చేశారు. పాలకుర్తిలో దయాకర్రెడ్డి ఓడిపోయినా సరే మీతోనే ఉంటున్నాడని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో తనపై 300 కేసులు పెట్టారని, తనపై ఎన్ని కేసులు పెట్టినా రేవంత్రెడ్డిని వదిలే ప్రసక్తే లేదని తెలిపారు. రేవంత్ రెడ్డి రైతులకు బాగా మంచి చేశాడని కడియం శ్రీహరి కాంగ్రెస్ పార్టీలో చేరారని, స్టేషన్ ఘనపూర్లో బై ఎలక్షన్స్ వస్తాయని, తాటికొండ రాజయ్యను గెలిపించుకుందామని అన్నారు ఈ కార్యక్రమంలో జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీలు సత్యవతి రాథోడ్, మాజీ ఎంపీ కవిత, మాజీ స్పీకర్ మధుసూదనా చారి, మాజీ ఎమ్మెల్యే తాడికొండ రాజయ్య, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాభవన్ ఎదుట కిడ్నీ రోగుల నిరసన



హైదరాబాద్ / శాసనసభ ప్రతినిధి : కిడ్నీ రోగులను కాంగ్రెస్ సర్కారు చిన్నచూపు చూస్తున్నదని బా ధితులు ఆగ్రహం వ్యక్తంచేశారు. హైదరాబాద్లోని జ్యోతిరావు పూలే ప్రజాభవన్ ఎదుట శుక్రవారం నిరసన తెలిపారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ సర్కారు జిల్లా దవాఖానలు, సీహెచ్సీల్లో డయాలసిస్ సెంటర్లు ఏర్పాటు చేసి మెరుగైన వైద్యం అందించిందని గుర్తుచేశారు. కానీ, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి పది నెలలు దాటినా మెరుగైన చికిత్స అందించడంలో నిర్లక్ష్యం చేస్తున్నదని మండిపడ్డారు. గత జనవరి ప్రజావాణిలో ఫిర్యాదు చేసినా, మంత్రులు, అధికారులను కలిసి విన్నవించినా పట్టించుకోలేదని వాపోయారు. కిడ్నీ రోగులకు ప్రతినెలా రూ.10వేల పింఛన్ ఇవ్వాలని, డయాలసిస్ సేవలను విస్తరించాలని డిమాండ్ చేశారు.

# అధైర్యపడొద్దు... అండగా ఉంటా

**గరీబోళ్ల మెడ మీద కత్తి పెడుతున్న సీఎంతో**

**ఎంత దూరమైనా వెళ్లి పోరాడతా: ఎంపీ ఈటల**



హైదరాబాద్ / శాసనసభ ప్రతినిధి : మూసీ పరివాహక ప్రాంత ప్రజలు ఆందోళనతో ఆరోగ్యాలు పాడు చేసుకోవద్దని...వారికి న్యాయం జరిగేంత వరకు తాను అండగా ఉంటానని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ భరోసా ఇచ్చారు. చైతన్యపురి డివిజన్ పరిధిలోని వినాయకనగర్, మారుతినగర్ నార్త్ కాలనీ మూసీ పరివాహక ప్రాంతాల్లో శుక్రవారం సాయంత్రం ఆయన స్థానిక కార్పొరేటర్ రంగా నర్సింహ గుప్తాతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా మనోవేదనతో అనారోగ్యం బారిన పడి ఆసుపత్రిలో చికిత్స పొందుతోన్న వినాయకనగర్ కాలనీకి చెందిన 60 ఏళ్ల లక్ష్మమ్మను ఫోన్లో పరామర్శించి ధైర్యం చెప్పారు. అదేవిధంగా ఇళ్లు కూల్చేస్తారన్న దిగులుతో ఫిట్స్కు గురైన న్యూ మారుతినగర్ నార్త్కు చెందిన ఓ గర్భిణి కుటుంబసభ్యులను పరామర్శించారు. మూసీ నిర్వాసితుల ఇళ్లకు ఎలాంటి నష్టం జరగకుండా ప్రభుత్వంతో ఎంతవరకైనా కొట్లాడుతానన్నారు. కోర్టు నుంచి స్టే తెచ్చుకొనేందుకు అవసరమైన న్యాయ సహాయం అందిస్తానని ఆయన హామీ ఇచ్చారు. పేదోళ్ల మెడ మీద కత్తి పెడుతున్న సీఎం రేవంత్రెడ్డితో ఎంత దూరమైనా పోరాడేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు. సామాన్యులతో పెట్టుకున్న ఏ ప్రభుత్వాలు కూడ ఎక్కువ కాలం మనుగడ సాగించలేదన్న విషయం గుర్తుంచుకోవాలని హితవు పలికారు.

# జగిత్యాలలో కర్షకుల కదనభేరి

శాసనసభ / జగిత్యాల టౌన్, అక్టోబర్ 4: జగిత్యాల జిల్లా రైతులు కదం తొక్కారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ చెప్పినట్టుగా షరతులు లేకుండా రూ.2 లక్షల రుణమాఫీ, ఎకరానికి రూ.15 వేల రైతు భరోసా, అన్నిరకాల వడ్లకు మద్దతు ధరపై క్వింటాల్కు రూ.500 బోనస్ ప్రకటించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం జగిత్యాల జిల్లా కేంద్రంలో భారీ నిరసన చేపట్టారు. జిల్లా నలుమూలల నుంచి సుమారు 2వేలకు మందికిపైగా తరలిరాగా, పాత మార్కెట్ బీటు నుంచి పాదయాత్రగా జగిత్యాల కలెక్టరేట్కు చేరుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతు ఐక్యవేదిక రాష్ట్ర నాయకుడు పన్నాల తిరుపతిరెడ్డి మాట్లాడుతూ.. ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చుతుందన్న నమ్మకంతో రైతులు కాంగ్రెస్ ప్రభుత్వానికి అండగా నిలిచి గద్దెనెక్కించారని, కానీ గెలిచిన తర్వాత మోసం చేశారని విమర్శించారు. వాగ్దానాలు అమలు చేయడంలో తీవ్ర నిర్లక్ష్యం వహించి రైతుల్లో గందరగోళం సృష్టించారని మండిపడ్డారు. 40 శాతం మందికి మాత్రమే రుణమాఫీ చేసి మిగతా 60 శాతం మందిని గాలికొదిలేశారని ఆరోపించారు. రుణమాఫీ అమలులో లేనిపోని ఆంక్షలు విధిస్తూ రైతులను రోడ్డుపాలు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రైతు రుణమాఫీలో రేషన్కార్డు అంటూ ఆంక్షలు విధించడం దారుణమని, బ్యాంకులు ఇచ్చిన రుణాల ఆధారంగా చేసుకొని రుణమాఫీ హామీని వంద శాతం పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. జిల్లా రైతు ఐక్యవేదిక అధ్యక్షుడు నల్ల రమేశ్రెడ్డి, నాయకులు వేముల కరుణాకర్రెడ్డి మాట్లాడుతూ రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, లేదంటే రాష్ట్రం నలుమూలల నుంచి రైతులు తరలివెళ్లి ముఖ్యమంత్రి నివాసాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. రైతులు దాదాపు 5 గంటలపాటు నిరసన వ్యక్తం చేసినా, కలెక్టర్ రాకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టరేట్ గేటు వద్దకు చేరుకొని బారికేడ్లను తోస్తూ నినాదాలు చేయడంతో ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. అదే సమయంలో కథలాపూర్ మండలం భూషణరావుపేట గ్రామానికి చెందిన రైతు బద్దం మహేందర్రెడ్డి సొమ్మసిల్లిపోగా,





పోలీసులు దవాఖానకు తరలించారు. నిరసన విషయం తెలుసుకున్న కలెక్టర్ అక్కడికి రాగా, రైతులు తమ డిమాండ్లను విన్నవించారు. డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని కలెక్టర్ హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.

# రాష్ట్రంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా టాప్.. 45 శాతం వాటా

హైదరాబాద్,శాసనసభ ప్రతినిధి : రాష్ట్ర రవాణాశాఖ అర్ధవార్షిక ఆదాయంలో ఉమ్మడి రంగారెడ్డి జల్లాదే 45 శాతం వాటా ఉందని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డిప్యూటీ కమిషనర్ చంద్ర శేఖర్ గౌడ్ స్పష్టం చేశారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నుంచి ప్రభుత్వానికి రూ.1436 కోట్ల ఆదాయం వచ్చిందని వెల్లడించారు. శుక్రవారం ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిధిలోని రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, వికారాబాద్ జిల్లాల అధికారులతో డీసీ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం చంద్రశేఖర్ గౌడ్ మాట్లాడుతూ.. రంగారెడ్డి జిల్లాలో రూ.802 కోట్లు, మేడ్చల్-మల్కాజిగిరిలో రూ.595 కోట్లు, వికారాబాద్ జిల్లాలో రూ.39 కోట్లు వచ్చిందని తెలిపారు. ప్రభుత్వం ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అర్ధవార్షిక ఆదాయ లక్ష్యం 1792 కోట్లు పెట్టగా, రూ.1436 కోట్లు సాధించామని, 80% ఆదాయ లక్ష్యాన్ని చేరుకున్నట్లు వివరించారు.రాష్ట్రానికి వచ్చిన రూ.3195 కోట్ల ఆదాయంలో 45% ఉమ్మడి రంగారెడ్డి జిల్లాదేనని తెలిపారు. త్రైమాసిక పన్నుల ద్వారా రూ.161 కోట్లు, జీవిత కాలపు పన్నుల ద్వారా రూ.1120 కోట్లు, ఫీజుల ద్వారా రూ.92 కోట్లు, సర్వీస్ ఛార్జీల ద్వారా రూ.21 కోట్లు, గ్రీన్ టాక్స్‌ల ద్వారా రూ.10 కోట్లు, తనిఖీల ద్వారా రూ.32 కోట్లు మొత్తం రూ.1436 కోట్ల ఆదాయాన్ని సాధించినట్లు వివరించారు. త్రైమాసిక పన్నులు చెల్లించని వాహనదారులు పన్నులు చెల్లించాలని లేని పక్షంలో



తనిఖీలలో పట్టుబడితే వాహనాలను సీజ్ చేయడంతో పాటు భారీ జరిమానా విధిస్తామని హెచ్చరించారు. ఓవర్ లోడ్‌తో తిరిగే వాహనాలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. 2024-25లో ప్రభుత్వం నిర్దేశించిన ఆదాయ లక్ష్యాన్ని చేరుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో మూడు జిల్లాల రవాణా శాఖ అధికారులు సుభాష్ చందర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, కిరణ్ కుమార్, శ్రీనివాస్ రెడ్డి, సుశీల్ రెడ్డి, నవీన్, వాసు, కృష్ణవేణి, మున్ని, అనూష, ఉపాసిని తదితరులు పాల్గొన్నారు.

# మాట ఇస్తే నెరవేర్చుతాం



హైదరాబాద్,శాసనసభ ప్రతినిధి : రైతుల రుణమాఫీ చేయబోమని ఎవరూ అనుమానాలు పెట్టుకోవద్దన్నారు. ప్రతి ఒక్కరికి రెండు లక్షల వరకు ఉన్న రుణమాఫీ చేసి తీరుతామని స్పష్టం చేశారు. ఆ పైన ఉన్నవారికి సైతం రూ.2 లక్షలు మాఫీ అవుతాయని, త్వరలో రైతు భరోసా అందించనున్నట్టు తెలిపారు. టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ పీసీసీ బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటిసారి తన సొంత జిల్లా నిజామాబాద్కు వస్తున్న సందర్భంగా కామారెడ్డి నియోజకవర్గంలోని భిక్కనూర్ టోల్ గేట్ వద్ద కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ నాయకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు.మహేష్ కుమార్ వెంట ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్, మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు ఉన్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో తుమ్మల మాట్లాడుతూ.. సన్నవడ్లకు రూ.500 బోనస్ అందిస్తామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో త్వరలో డిజిటల్ కార్డు అందిస్తామని, దాంతోనే హెల్త్ కార్డు, రేషన్ అన్ని సదుపాయాలు పొందుపరుస్తామని చెప్పారు. షబ్బీర్అలీ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు కష్టపడి నాయకులను గెలిపించి పార్టీని అధికారంలోకి తీసుకువచ్చారని, ఇప్పుడు నాయకులం కష్టపడి కార్యకర్తలను గెలిపించుకుంటామని తెలిపారు. త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపు కోసం అందరూ కృషి చేయాలని అన్నారు.

# మూసీ పునర్నిర్మాణానికి మద్దతు తెలపాలి



హైదరాబాద్,శాసనసభ ప్రతినిధి : నిజాం కాలంలో నిర్మించిన మూసీ పునర్నిర్మాణానికి అన్ని వర్గాల వారు మద్దతు తెలపాలని భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్రెడ్డి అన్నారు. ఉమ్మడి నలగొండ జిల్లాలో లక్ష ఎకరాలకు సాగునీరు, వేలాది మందికి తాగునీరు అందిస్తున్న మూసీ.. వ్యర్థాలతో నిండుకొని కలుషితమైందని చెప్పారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా మట్టపల్లి వద్ద విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. హైదరాబాద్, రంగారెడ్డి, ఉమ్మడి నల్లగొండ జిల్లాలకు జీవనాధారగా ఉన్న మూసీ నదికి పునరుజ్జీవం తీసుకొచ్చేందుకు తమ ప్రభుత్వం చేస్తున్న మంచి పనికి హర్షించాలన్నారు. ప్రక్షాళన తరువాత మలన్నసాగర్ నుంచి 2 టీఎంసీల నీటిని గండిపేటకు.. అక్కడి నుంచి మూసీ నదిలోకి తీసుకొస్తామని చెప్పారు. గత ప్రభుత్వంలో మూసీ డెవలప్మెంట్ బోర్డ్ ఏర్పాటు చేసి ఎటువంటి చర్యలూ తీసుకోలేదన్నారు. మూసీ నీటిని శుభ్రపరిచి రైతులకు వ్యవసాయానికి, ప్రజలకు తాగునీరు అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ నది భువనగిరి, ఆలేరు, నకిరేకల్, తుంగతుర్తి, మునుగోడు, నల్లగొండ సూర్యాపేట, హుజూర్నగర్ నియోజకవర్గాల గుండా శూన్యంపాడు వద్ద కృష్ణా నదిలో కలుస్తుందన్నారు. తమ ప్రభుత్వం మూసీ నదిని పూర్తిస్థాయిలో శుభ్రపరిచేందుకు కట్టుబడి ఉందని, పూర్తిగా మానవతా దృక్పథంతో ముందుకు సాగుతామని అన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు భూక్యా మంజీనాయక్, డీఎస్పీ శ్రీధర్రెడ్డి, ఆర్డీవో శ్రీనివాస్, ట్రాన్సుకో డీఈ వెంకటకృష్ణ, ఏడీ సక్రు నాయక్, తహసీల్దార్ మంగారాతోడ్, సీఐ చరమందరాజు, రామిశెట్టి అప్పారావు, వంటిపులి శ్రీనివాస్, ఈడుపుగంటి సుబ్బారావు, అరుణ్ కుమార్ దేశముఖ్, న్యాయవాదులు సాముల రామిరెడ్డి, లక్ష్మీనారాయణ రెడ్డి, నారపరాజు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## నక్సలైట్‌నని బెదిరించి భారీగా వసూళ్లు..

# నిందితుడి అరెస్టు



శాసనసభ ప్రతినిధి / వనపర్తి : నక్సలైట్ పేరుతో అమాయకులను బెదిరించి వసూళ్లకు పాల్పడుతున్న నిందితుడుని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ సంఘటన వనపర్తి జిల్లాలో చోటు చేసుకుంది. శుక్రవారంజిల్లా పోలీసు కార్యాల యంలో ఎస్పీ రావుల గిరిధర్ మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం, మామిరెడ్డిపల్లి గ్రామనికి చెందిన తిప్పిరెడ్డి సుదర్శన్‌రెడ్డి అలియాస్ ప్రమోద్‌రెడ్డి అనే వ్యక్తి మాజీ నక్సలైట్ అని చెప్పుకొని తిరుగుతున్నాడు. ఈ క్రమంలో సోలిపూర్ గ్రామానికి చెందిన తేనేటి శేఖర్‌రెడ్డికి ఫోన్ చేసి రైస్ మిల్లు అసోసియేషన్ నుంచి రూ.50 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. డబ్బులు వెంటనే ఇవ్వకుంటే మిమ్మల్ని చంపుతానని చెప్పి బెదిరించాడు. శేఖర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు సుదర్శన్‌రెడ్డి అరెస్ట్ చేశారు. పోలీసు విచారణలో నిందితుడు నేరం ఒప్పుకున్నాడని ఎస్పీ తెలిపారు. గతంలో హైదరాబాద్‌లో సెటిల్మెంట్లు చేసేవాడన్నారు. నిందితుడిని చాకచక్యంగా పట్టుకున్న పోలీస్ సిబ్బందిని ఎస్పీ అభినందించారు. ఎవరైనా ఇలాంటి నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## నాగార్జున హీరో కాదు విలన్.. ఆ ఒక్క కారణంతోనే మంత్రిని

# ఇబ్బంది పెడుతున్నారు: తీన్మార్ మల్లన్న

హైదరాబాద్,శాసనసభ ప్రతినిధి : తెలంగాణ రాజకీయాలతో పాటు తెలుగు చిత్ర సీమలో మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్న సంగతి తెలిసిందే. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మీద విమర్శలు చేసే క్రమంలో..నాగచైతన్య, సమంత విడాకుల గురించి ప్రస్తావిస్తూ.. అక్కినేని కుటుంబంపై కొండా సురేఖ తీవ్రమైన ఆరోపణలు చేశారు. మంత్రి చేసిన వ్యాఖ్యలను అటు రాజకీయ నాయకులతో పాటు తెలుగు చిత్రపరిశ్రమకు సంబంధించి చాలా మంది ప్రముఖులు తీవ్రంగా ఖండిస్తున్నారు. అంతేకాకుండా.. కొండా సురేఖపై నాగార్జున పరువు నష్టం దావా కూడా వేశారు. అయితే.. ఈ వ్యవహారంపై కాంగ్రెస్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అలియాస్ చింతపండు నవీన్ స్పందించారు.

## 'బీజేపీ మెప్పు కోసం మంద కృష్ణ తాపత్రయం'

మొదటి పేజీ తరువాయి

అయినప్పటికీ మంద కృష్ణ బీజేపీకి మైలేజ్ వచ్చేలా వ్యాఖ్యలు చేస్తూ, కాంగ్రెస్ పై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నాడని విమర్శించారు. గతంలో మంద కృష్ణ మాదిగ మద్దతు ఇచ్చిన సీఎం లు, సుప్రీం కోర్టులో అడ్వైకెట్లను ఎందుకు పెట్టలేదో? తెలుసుకోవాలని సూచించారు.వర్గీకరణ జరగాలి అని స్వయంగా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే చెప్పారని గుర్తు చేశారు. కొప్పుల రాజు వర్గీకరణ ను ఎన్నడూ వ్యతిరేకించలేదన్నారు. 2017 నుంచి బీజేపీ కి మద్దతుగా మంద కృష్ణ వ్యవహరిస్తున్నాడన్నారు. సుప్రీం కోర్టు తీర్పు అయ్యాక, కేంద్రం ఎందుకు కోటిపై చేయలేదనేది మంద కృష్ణ ప్రశ్నించాల్సిన అవసరం ఉన్నదన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో వర్గీకరణ ప్రాసెస్ ను ముందుకు తీసుకువెళ్లే బాధ్యత మంద కృష్ణ తీసుకోవాలని సూచించారు. ప్రజలను కన్‌ఫ్యూజ్ చేసేందుకు నిత్యం ఓ కొత్త రాగం ఎత్తుకోవడం బంద్ పెట్టాలని ఆగ్రహం వ్యక్తం చేశారు.

తెలంగాణ శాసనసభ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

కేంద్ర ప్రభుత్వంచే గుర్తించబడిన తెలంగాణ శాసనసభ
తెలుగు దిన పత్రికలో ఈ ప్రాంతాల్లో వార్తలు
సేకరించడానికి విలేకరులు కావలెను.

తెలుగులో రాయగల సమర్థత, సమాజం పట్ల అవగాహన ఉంటే చాలు

నల్గొండ జిల్లాలో ఖాళీగా ఉన్న డేట్ లైన్లు

నల్గొండ జిల్లా: చందంపేట, డిండి, పి.ఏ.పల్లి, నాంపల్లి, మర్రిగూడ, గుర్రంపోడు, చండూర్, మునుగోడు, హాలియా, పెదవూర, నిడుమనూరు, నల్గొండ, కనగల్, మిర్యాలగూడ, త్రిపురారం, కట్టంగూర్, తిప్పర్తి, నకిరేకల్ తదితర ప్రాంతలలో పనిచేయుటకు ఆసక్తిగల వారు క్రింది ఫోన్ నంబర్లకు సంప్రదించండి.

తెలంగాణ శాసనసభ దినపత్రిక నెట్‌వర్క్ ఇంచార్జ్ వెంకటేశ్

సెల్: 9949360937,9100900931